




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 58 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఎన్.టి.ఆర్ జిల్లా గురువారం 12 మార్చి 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 58 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : NTR DIST, THU 12 MARCH 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur




**పార్టీ ఫిరాయింపుల వ్యవహారం...**

## కడియం, దానంలకు క్లీన్ చిట్ ఇచ్చిన స్పీకర్

- కడియం, దానంలపై దాఖలైన అనర్హత పిటిషన్లన్ను వేసిన స్పీకర్
- పార్టీ మారినట్టు సరైన ఆధారాలు లేవన్న స్పీకర్
- తాజా తీర్పుతో మొత్తం 10 మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్

మిగతా 2లో

## ఇరాన్‌తో యుద్ధం త్వరలో ముగుస్తుంది.. నేనెప్పుడు అనుకుంటే అప్పుడే ఆగిపోతుంది

- ఇరాన్‌లో లక్ష్యాలను ఛేదించామన్న ట్రంప్
- ఇరాన్ వద్ద ఇంకా ఏమీ మిగలలేదని వ్యాఖ్య
- యాక్సియోస్ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు



పెన్ పవర్ డెస్క్:అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. నేను ఎప్పుడు అనుకుంటే అప్పుడు యుద్ధం ఆగుతుందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో అన్ని లక్ష్యాలను ఛేదించామని ఆయన వెల్లడించారు. ఇరాన్ వద్ద ఇంకా ఏమీ మిగలలేదని అన్నారు. ఇరాన్‌తో

మిగతా 2లో

## లోక్‌సభ స్పీకర్‌కు ఊరట.. వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం తిరస్కరణ
- మూజువాణి ఓటుతో వీగిపోయిన ప్రతిపక్షాల తీర్మానం
- చర్చలో రాహుల్ గాంధీపై అమిత్ షా తీవ్ర విమర్శలు
- చైర్‌లో కూర్చోకుండా కొత్త సంప్రదాయానికి తెరతీసిన ఓం బిర్లా
- స్పీకర్‌ను ఇరుకున పెట్టాలనుకున్న విపక్షాల వ్యూహం విఫలం



మిగతా 2లో

# పాలనలో మార్పు రావాలి.. పరిశుభ్రతపై దృష్టి పెట్టండి

## కలెక్టర్లకు సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

- స్వచ్ఛాంధ్రపై సీరియస్‌గా ఉండాలని, పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని సూచన
- సచివాలయ సిబ్బంది బదిలీలపై కలెక్టర్లకు పూర్తి అధికారాలు
- కౌలు రైతులకు రుణాల మంజూరులో అడ్డంకులు తొలగించాలని ఆదేశం
- పాలనలో డీప్ టెక్ వినియోగం పెంచాలని దిశానిర్దేశం



పెన్ పవర్ డెస్క్:ఆరు జిల్లాల కలెక్టర్లతో సీఎం చంద్రబాబు నిర్వహిస్తున్న కాన్ఫరెన్స్ సమావేశం కొనసాగుతోంది. ఈ సందర్భంగా పలు శాఖల ఉన్నతాధికారులు తమ నివేదికలను ప్రజెంటేషన్ల రూపంలో సమర్పించారు. ఈ సమావేశంలో స్వచ్ఛాంధ్ర, పాలనలో సాంకేతికత వినియోగం, సచివాలయ సిబ్బంది సర్దుబాటు, కౌలు రైతుల సమస్యలపై సీఎం చంద్రబాబు పలు కీలక ఆదేశాలు, సూచనలు జారీ చేశారు.ఇటీవల తాను కాకినాడ, సామర్లకోటలో పర్యటించినప్పుడు రోడ్ల పక్కన చెత్త కనిపించిందని, కొన్ని ప్రాంతాల్లో స్వచ్ఛాంధ్రపై సీరియస్‌నెస్ కొరవడిందని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్లు పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల కోసం నగరాలు, పట్టణాలు ఒకదానికొకటి పోటీ పడాలని సూచించారు. పరిశుభ్రత మన సంస్కృతిలో భాగమని, ఆరోగ్యానికి ఇది చాలా కీలకమని గుర్తుచేశారు.గ్రామ, వార్డు సచివాలయాల్లోని సిబ్బంది సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం

మిగతా 2లో

## చంద్రబాబు ఉప ప్రధానా?.. జగన్ రియాక్షన్ వైరల్!

- చంద్రబాబు జాతీయ రాజకీయాల్లోకి వెళ్తారంటూ ప్రచారం
- ఉప ప్రధాని అవుతారంటూ సోషల్ మీడియాలో ఊహాగానాలు
- ఈ వార్తలపై తనదైన శైలిలో స్పందించిన వైఎస్ జగన్
- రాష్ట్ర ప్రజలే భరించలేకపోతున్నారు.. దేశం ఏం భరిస్తుంది? అంటూ ఎద్దేవా



పెన్ పవర్ డెస్క్:టీడీపీ అధినేత, సీఎం చంద్రబా బు జాతీ య రాజకీయాల్లోకి వెళ్లి ఉప ప్రధాని అవుతారంటూ జరుగుతున్న ప్రచారంపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పందించారు. తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాష్ట్ర ప్రజలే చంద్రబాబును భరించలేకపోతు న్నారని, ఇక దేశ ప్రజలు ఎలా భరిస్తారని ఆయన ఎద్దేవా చేశారు ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఓ విలేకరి.. చంద్రబాబు జాతీయ రాజకీయాల్లోకి వెళతారని, ఉప ప్రధాని అవుతారని ప్రచారం జరుగుతోంది కదా అని జగన్‌ను ప్రశ్నించారు. దీనికి జగన్ బదులిస్తూ, “చంద్రబాబు ఉప ప్రధానా? ఎవరు చెప్పినారు సామీ.. గొప్ప సంగతే ఇది. చంద్రబాబును ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజలే బరాయించలేకున్నారు.. ఉప ప్రధానిగా దేశ ప్రజలు ఏం బరాయిస్తారు” అంటూ సెటైర్లు వేశారు. ఇటీవల

మిగతా 2లో

## జగన్ చిట్టా కేంద్ర ప్రభుత్వం వద్ద ఉంది

- జగన్ హయాంలో రాష్ట్రం దివాలా తీసిందన్న అప్పలనాయుడు
- వింత పాలసీలతో ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశారని మండిపాటు
- జగన్ ప్రభుత్వం మహిళల మాంగల్యాలను తెంపిందని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆ ర్థికంగా నాశనం చేసిందంటూ వైసీపీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలపై ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఘాటుగా స్పందిం చారు. జగన్ హయాంలో రాష్ట్రం దివాలా తీసిందని, ఇప్పుడు ఆయన ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని మండిపడ్డారు. “జగన్ హయాంలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు. చివరకు మున్సిపల్ కార్యాల యాలను కూడా తాకట్టు పెట్టారు. దేశంలో ఎక్కడా లేని వింత పాలసీలతో ఆర్థిక వ్యవస్థను

మిగతా 2లో

## ఉగాదికి సామూహిక గృహప్రవేశాలు.. ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటన


- రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల మందికి చేకూరనున్న లబ్ధి
- మున్ముందు విద్యుత్ ఛార్జీలు మరింత తగ్గిస్తాం..
- కలెక్టర్ల సదస్సులో ఏపీ సీఎం చంద్రబాబు కీలక నిర్ణయాలు




మిగతా 2లో

## వివేకా హత్య కేసు.. ట్రయల్ కోర్టుకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు.. సునీత పిటిషన్ కొట్టివేత


- వివేకా హత్య కేసు దర్యాప్తు ముగిసిందని సుప్రీంకోర్టుకు తెలిపిన సీబీఐ
- నాలుగు వారాల్లోగా విచారణను ముగించాలని ట్రయల్ కోర్టుకు సుప్రీం ఆదేశం
- నిందితుల బెయిల్ రద్దు చేయాలన్న సునీత, సీబీఐ పిటిషన్లు డిస్మిస్



మిగతా 2లో

## ఇరాన్, అమెరికా యుద్ధాన్ని కాంగ్రెస్ పార్టీ రాజకీయానికి ఉపయోగించుకుంటోంది నరేంద్రమోదీ ఆగ్రహం


- ప్రవాస భారతీయుల పరిస్థితి దిగజారేలా కాంగ్రెస్ బాధ్యతారాహిత్య ప్రకటనలు చేస్తోందని ఆగ్రహం
- గల్ఫ్‌లోని పరిస్థితుల కారణంగా మన ఆందోళన సహజమేనన్న ప్రధానమంత్రి
- లక్షలాది మంది భారతీయులు అక్కడ పని చేస్తున్నారన్న మోదీ
- గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయులను ఒంటరిగా వదలం అన్న నరేంద్ర మోదీ



మిగతా 2లో




## వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ సంక్షోభం...



మిగతా 2లో

### కేంద్రం కీలక ప్రకటన



- వంట గ్యాస్‌పై ప్రజల్లో ఆందోళన అవసరం లేదన్న కేంద్రం
- ఎల్పీజీ ఉత్పత్తిని 25 శాతం పెంచాలని చమురు కంపెనీలను ఆదేశం
- ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా చమురు దిగుమతి అవుతోందన్న కేంద్రం

పెన్ పవర్ డెస్క్:పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో దేశవ్యాప్తంగా వంట గ్యాస్‌పై ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. బుకింగ్ చేసిన రెండున్నర రోజుల్లో వంట గ్యాస్ సిలిండర్ డెలివరీ అవుతుందని తెలిపింది. ఎల్పీజీ ఉత్పత్తిని 25 శాతం పెంచాలని చమురు కంపెనీలను ఇప్పటికే ఆదేశించినట్లు వెల్లడించింది. పెట్రోల్, డీజిల్, ముడి చమురు, వంట గ్యాస్ సరఫరా విషయంలో ఆందోళన అవసరం లేదని తెలిపింది.

## ఎడిటర్ వ్యూ

# వ్యర్థంగా మారిన ధూమపాన ప్రకటనలు

సొలనేసి కుటుంబానికి చెందిన ఒక చిన్న మొక్క ద్వారా తయారీ వల్ల పొగ విడుదల అవుతున్నందు వలన దీనికి 'పొగాకు' అనే పేరు వచ్చింది. దీని ఆకుల నుండి సిగరెట్లు, చుట్టలు తయారు చేస్తారు. దీనిని కొన్ని రకాల తాంబూలాలలో కూడా ఉపయో గిస్తున్నారు. క్రీస్తు పూర్వం 1400 ఏళ్ల నాడే పొగాకు వాడకం మొదలైంది. ఉత్తర, దక్షిణ అమెరికా ప్రాంతాల్లోని స్థానిక తెగల వారు పొగాకును దేవుని కానుకగా పరిగణించే వారు. వేడుకల్లో పొగ తాగేవారు. పొగాకు చుట్టల నుంచి వెలువడే ధూమ మేఘాల ద్వారా తమ ప్రార్థనలు భగవంతుని చేరుకుంటాయని వారు నమ్మేవారు. యూరోపియన్లు అమెరికాలో అడుగు పెట్టడం ప్రారంభ మయ్యాక క్రీస్తుశకం 16వ శతాబ్దం నాటికి పొగాకు క్రమంగా యూరోపియన్ దేశాలకు, ఆ తర్వాత శరవేగంగా ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించింది. బ్రిటిష్ వారి ద్వారా పొగాకు భారత దేశానికి చేరుకుంది. పొగాకు పరిచయం కావడానికి ముందు భారత దేశంలో ఎక్కువగా గంజాయి తోనే పొగ తాగేవారు. ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటు లోకి వచ్చిన తొలినాళ్లలో పొగాకును ఔషధంగా పరిగణించే వారు. సిగరెట్ల కంపెనీలు వైద్యులతో వ్యాపార ప్రకటనలు ప్రచారం చేసుకునేవి. 20వ శతాబ్దిలో సగానికి సగం కాలం ఇలాగే గడిచింది. పొగాకు వల్ల క్యాన్సర్ వంటి అనర్థాలు తలెత్తు తున్నట్లు గుర్తించిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సహా పలు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు పొగాకు వ్యతిరేక ప్రచారం ప్రారంభించాయి. పలు ప్రభుత్వాలు కూడా పొగాకు వాడకంపై ఆంక్షలు అమలులోకి తెచ్చాయి. బొలీవియా మరియు పెరూ పొగాకు జన్మస్థలంగా పరిగణించ బడతాయి. క్రిస్టోఫర్ కొలంబస్ యాత్రల ద్వారా ఐరోపాకు తీసుకు రాబడినట్లు, అలా పొగాకు సాగు క్రమంగా ఉత్తర అమెరికా, చైనా, భారతదేశం, పూర్వ యుఎస్ ఎస్ఆర్ భూభాగంలో, ట్రాన్స్కా కాసియా, ఉజ్బెకిస్తాన్, కజకిస్తాన్, మోల్డోవా, ఉక్రెయిన్, క్రిమియా మరియు క్రాస్నోదర్ భూభాగంలో పెంచడం క్రమానుగతంగా జరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా 110 కోట్ల మంది పొగ తాగుతున్నారని, ఏటా పొగాకు కారణంగా 70లక్షల మంది మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది.ప్రపంచం లోనే అత్యధిక శాతం కిరిబాటి దీవిలో మూడులో రెండొంతుల మంది మగవాళ్లు ధూమపానానికి అలవాటు పడ్డారు. మూడొంతుల మంది ఆడవాళ్లు కూడా పొగ తాగుతున్నారు. యూరప్‌లోని మాంటెనెగ్రో దేశంలో 46శాతం మంది ప్రజలకు పొగతాగే అలవాటుంది. గ్రీస్‌లో 50శాతం మంది మగవాళ్లు, 35శాతం మంది ఆడవాళ్లు ధూమపానం చేస్తారు. ప్రపంచం లోనే అత్యధికంగా ఈస్ట్ తైమూర్‌లో 80శాతం మంది మగవాళ్లు పొగ తాగుతారు. కానీ 6శాతం మంది ఆడవాళ్లకు మాత్రమే ఆ అలవాటుంది. రష్యాలో 15ఏళు పైబడిన మగవాళ్లలో 60శాతం మంది పొగ తాగుతున్నారు. 23శాతం మంది మహిళలకు ఆ అలవాటుంది. ఇక తక్కువగా పొగ తాగేవారు ఉండే దేశాలు...ఘనా, ఇథియోపియా, నైజీరియా, ఎరిత్రియా, పనామా... ఈ ఐదు దేశాలూ అతి తక్కువగా పొగ తాగే దేశాల జాబితాలో ముందు వరుసలో ఉన్నాయి. ఆఫ్రికాలో 14శాతం మంది మాత్రమే పొగ తాగుతారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. ఇటీవలి కాలంలో అవగాహన కార్యక్రమాల ఫలితంగా భారత దేశంలో పొగతాగే వారి సంఖ్య 33.8 శాతం నుంచి 23 శాతానికి తగ్గినట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. సిగరెట్లు, బీడీలు, సిగార్లు, హుక్కా వంటి ధూమపానం, గుట్కా నమలడం కోసం పొగాకును వివిధ రకాలుగా విక్రయిస్తారు. నికోటిన్ అనేది పొగాకులో ఉండే ప్రధాన విష పదార్థం. ఇది ధూమపానం వ్యసనానికి దారితీస్తుంది. పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టాలే అధికం. పొగాకు శరీర అవయవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ఊపిరి తిత్తులకు ముప్పు వాటిల్లి ఎంఫసియా, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ ఫల్మనరీ డిసీజ్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయి. మెదడులో రక్త ప్రసరణకు అంతరాయం ఏర్పడుతుంది. గొంతు కేన్సర్, గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా పీల్చేవారికీ కూడా ప్రమాదమే. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక మరణాలకు కారణమవుతున్న కేన్సర్‌లు, గుండె జబ్బులు, నాన్-కమ్యూనికెబుల్ వ్యాధులు (ఎన్‌సిడిలు) వంటి దీర్ఘకాల శ్వాసకోశ వ్యాధులు ధూమపానం వలనే సంభవిస్తాయి. పొగాకు తాగేవారు శ్వాస సంబంధిత సమస్యలను కలిగి ఉంటారు ఎందుకంటే, పొగాకు ఊపిరి తిత్తులను పూర్తిగా ప్రమాదానికి గురి చేస్తుంది. అంతేకాకుండా, వీరిలో అధిక శ్లేష్మంతో కూడిన దగ్గు కూడా వస్తుంది. 80% కంటే ఎక్కువ ఊపిరితిత్తుల క్యాన్సర్ మరణాలకు ధూమపానం కారణమని తెలింది. సిగరెట్లలో 70కి పైగా హానికరమైన క్యాన్సర్ కలిగించే రసాయనాలు ఉంటాయి. కో విడ్ మహమ్మారి విజృంభించిన నేపథ్యంలో పొగ త్రాగడం చాలా వరకు తగ్గింది. పొగ తాగడం నేరుగా ఊపిరి తిత్తుల పై ప్రభావం చూపే విషయం వల్ల భయం ప్రధాన కారణం అయితే, లాక్ డౌన్ కట్టుదిట్టమైన చర్యల వల్ల షాపులు ఎక్కువ సమయం మూసి ఉండడం, ఇళ్లనుండి బయటికి వెళ్ళలేక పోవడం ధూమపానానికి ప్రతిబంధకాలుగా మారడం పొగాకు వాడకం తగ్గడానికి కొన్ని కారణాలు.

# పాలనలో మార్పు రావాలి.. పరిశుభ్రతపై దృష్టి పెట్టండి

- మొదటి పేజి తరువాయి
లేదని, ముఖ్యంగా మహిళా పోలీసుల సేవలు వృథా అవుతున్నాయని సీఎం పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, అవసరాన్ని బట్టి సిబ్బందిని ఆర్ అండ్ బి, హెల్త్, మున్సిపల్ వంటి ఇతర శాఖలకు సర్దుబాటు చేసే పూర్తి అధికారాలను కలెక్టర్లకు అప్పగిస్తున్నట్టు ప్రకటించారు. సిబ్బంది బదిలీలు సిఫార్సుల ఆధారంగా కాకుండా, రేషనలైజేషన్ ప్రకారమే పారదర్శకంగా జరగాలని స్పష్టం చేశారు.కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయడంలో ఎలాంటి నిబంధనలు అడ్డంకిగా ఉన్నా వాటిని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయంతో పాటు ఉద్యాన, పశుసంవర్ధక రంగాల వైపు రైతులను ప్రోత్సహించాలన్నారు. యూరియా వాడకాన్ని తగ్గించేందుకు నానో యూరియాను ఉచితంగా అందించే అవకాశాన్ని పరిశీలించాలని, దీనిపై కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని సూచించారు. ఈ నెల 16, 17, 18, 23, 24, 25 తేదీల్లో 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించారు.పాలనలో ఏఐ, బ్లాక్ చైన్, ఐఓటీ వంటి డీప్ టెక్నాలజీ వినియోగాన్ని పెంచడం ద్వారా వేగంగా, తక్కువ వ్యయంతో ఫలితాలు సాధించవచ్చని సీఎం తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగానికి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని తప్పనిసరి అర్హతగా చేర్చాలని సాధారణ పరిపాలన శాఖను ఆదేశించారు. ప్రతి జిల్లాలో హెచ్ఆర్ ఇనిస్టిట్యూట్, ఆర్టీజీఎస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుని పనితీరును మెరుగుపరుచుకోవాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

## వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ సంక్షోభం... కేంద్రం కీలక ప్రకటన

- మొదటి పేజి తరువాయి
కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. దేశవ్యాప్తంగా ఇంధన సరఫరా సజావుగా సాగేలా చూడాలని సూచించింది. దేశీయ అవసరాలకు కావాల్సిన ముడి చమురులో 75 శాతానికి పైగా హోర్ముజ్ జలసంధికి సంబంధం లేని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపింది. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీలు, చీఫ్ సెక్రటరీలను ఆదేశించింది.గ్లోబల్ షిప్పింగ్ మార్గాల్లో ఆటంకాలు ఉన్నప్పటికీ, భారత్‌కు ముడి చమురు దిగుమతులు నిరంతరాయంగా అందుతున్నాయని కేంద్ర పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

భారత్‌కు చమురు తీసుకువచ్చే అదనపు కార్గో షిప్‌లు కూడా వస్తున్నాయని వెల్లడించారు. పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతున్నప్పటికీ మన దేశంలో ఇంధన అవసరాలకు ఎలాంటి ఇబ్బంది లేదని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

# లోక్‌సభ స్పీకర్‌కు ఊరట.. వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. సుమారు 13 గంటల పాటు జరిగిన సుదీర్ఘ చర్చ అనంతరం, తీవ్ర గందరగోళం మధ్య తాత్కాలిక స్పీకర్ జగదాంబికా పాల్ నిర్వహించిన మూజువాణి ఓటుతో ఈ తీర్మానాన్ని తిరస్కరించారు. అవిశ్వాసంపై హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇస్తున్న సమయంలో ప్రతిపక్షాలు తీవ్ర నినాదాలతో సభను అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.స్పీకర్ ఓం బిర్లా పక్షపాతంతో, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఎంపీ మహ్మద్ జావేద్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనికి 118 మంది విపక్ష ఎంపీలు మద్దతు తెలిపారు. నిన్న చర్చను ప్రారంభించిన కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్, ఇది వ్యక్తిగతంగా బిర్లాను లక్ష్యం చేసుకోవడానికి కాదని, పార్లమెంట్ గౌరవాన్ని కాపాడటానికే అని పేర్కొన్నారు. దీనికి బదులిచ్చిన పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, స్పీకర్ పనితీరును గట్టిగా సమర్థించారు.అయితే, చర్చకు సమాధానమిచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రతిపక్షాల ఆరోపణలను తీవ్రంగా తిప్పికొట్టారు. స్పీకర్ స్థానం అత్యంత పవిత్రమైందని, ఆయన నిర్ణయాలను సుప్రీంకోర్టులో సైతం ప్రశ్నించలేమని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో, నేటి కాంగ్రెస్ మిత్రపక్షాలైన సమాజ్‌వాదీ పార్టీ, కమ్యూనిస్టు పార్టీలే స్పీకర్లపై అవిశ్వాసం పెట్టాయని గుర్తుచేశారు. ఆ సమయంలో స్పీకర్లు చైర్‌లోనే కూర్చోగా, ఈసారి ఓం బిర్లా మాత్రం తీర్మానంపై నిర్ణయం వెలువడే వరకు చైర్‌లో కూర్చోకుండా కొత్త పార్లమెంటరీ సంప్రదాయానికి శ్రీకారం చుట్టారని ప్రశంసించారు.

ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అమిత్ షా లక్ష్యంగా చేసుకున్నారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నప్పుడు రాహుల్ తరచూ విదేశీ పర్యటనలకు వెళ్తారని, బడ్జెట్, మహిళా రిజర్వేషన్ బిల్లు వంటి కీలక చర్చల్లో పాల్గొనడానికి ఎందుకు ఇష్టపడరని ప్రశ్నించారు. "సమావేశాలు వచ్చినప్పుడల్లా ఆయన విదేశీ పర్యటనలు ప్లాన్ చేసుకుంటారు. మరి విదేశాల నుంచి ఇక్కడ మాట్లాడతారా?" అని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.మొత్తం మీద స్పీకర్‌ను ఇరుకున పెట్టాలనుకున్న ప్రతిపక్షాల వ్యూహం ఫలించలేదు. పైగా ప్రభుత్వ ఎదురుదాడితో ప్రతిపక్షాలే ఆత్మరక్షణలో పడినట్లు కనిపించింది. ఈ పరిణామం విపక్షాలకు రాజకీయంగా ఇబ్బందికరంగా మారింది.

# ఇరాన్, అమెరికా యుద్ధాన్ని కాంగ్రెస్ పార్టీ రాజకీయానికి ఉపయోగించుకుంటోంది

ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధాన్ని కాంగ్రెస్ పార్టీ మన దేశంలో రాజకీయానికి ఉపయోగించుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేరళ పర్యటనలో ఉన్న ఆయన ఎర్నాకులంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, పశ్చిమాసియా దేశాల్లోని ప్రవాస భారతీయుల పరిస్థితి మరింత దిగజారేలా రెచ్చగొట్టే, బాధ్యతారాహిత్య ప్రకటనలు చేస్తోందని కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు.గల్ఫ్‌లోని పరిస్థితుల కారణంగా మనం ఆందోళన చెందడం సహజమేనని, అక్కడ లక్షలాది మంది భారతీయులు పని చేస్తున్నారని గుర్తు చేశారు. కానీ ఇక్కడ అధికారంలో ఉన్నది బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే అని అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. మన పౌరులు విదేశాల్లో చిక్కుకున్నప్పుడల్లా వారి క్షేమం కోసం వనరులన్నీ ఉపయోగిస్తుంటామని అన్నారు. మన పౌరులను ఎప్పుడూ ఒంటరిగా వదిలేసేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లోని మన వారికి అవసరమైన సహాయం అందేలా ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని వెల్లడించారు. అక్కడి మన దేశ రాయబార కార్యాలయాలు మన పౌరులకు 24 గంటలు అందుబాటులో ఉంటున్నాయని తెలిపారు. మన మిత్ర దేశాలు భారతీయులను జాగ్రత్తగా చూసుకుంటున్నట్లు తెలిపారు. ఇలాంటి సంక్షోభ సమయంలో కాంగ్రెస్ పార్టీ మాత్రం రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

ప్రజల్లో ఆందోళనలు రేకెత్తించేలా కాంగ్రెస్ పార్టీ మాట్లాడటం దురదృష్టకరమని అన్నారు. ఈ ప్రచారం కోసం వారు అవసరమైతే రీల్స్ కూడా చేస్తారేమోనని ఎద్దేవా చేశారు. ఆత్మనిర్భర్ భారత్‌ను నిర్మించేందుకు, మేకిన్ ఇండియాను బలోపేతం చేయడానికి పెట్రోలియం రంగాన్ని విస్తరించడం ఎంతో కీలకమని అన్నారు. ఈ యుద్ధం స్వావలంబన అవశ్యకతను మరోసారి నొక్కి చెప్పిందని అన్నారు.

# పార్టీ ఫిరాయింపుల వ్యవహారం... కడియం, దానంలకు క్లీన్ చిట్ ఇచ్చిన స్పీకర్

తెలంగాణ రాజకీయాల్లో గత కొంతకాలంగా ఉత్కంఠ రేపుతున్న ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల వ్యవహారానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ తెరదించారు. అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలపై దాఖలైన అనర్హత పిటిషన్లను ఆయన కొట్టివేస్తూ, వీరికి క్లీన్ చిట్ ఇచ్చారు. వీరిద్దరూ అధికారికంగా పార్టీ మారినట్లు సరైన ఆధారాలు లేవని, ఈ కారణంగా వారిపై అనర్హత వేటు వేయలేమని స్పీకర్ తన తీర్పులో స్పష్టం చేశారు. ఈ అంశంపై రేపు (గురువారం) సుప్రీంకోర్టులో విచారణ జరగాల్సి ఉంది. కోర్టు విచారణకు ముందు రోజు ఈ వ్యవహారంపై స్పీకర్ తన విచారణను ముగించి, తీర్పులను వెలువరించారు. దానం, కడియంలతో పాటు పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న మొత్తం 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడం గమనార్హం. ఫిర్యాదుదారులు సమర్పించిన ఆధారాలు వారిని అనర్హులుగా ప్రకటించడానికి సరిపోవని స్పీకర్ తన తీర్పులో పేర్కొన్నారు. అయితే, స్పీకర్ నిర్ణయంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు ఎలా స్పందిస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## వివేకా హత్య కేసు.. ట్రయల్ కోర్టుకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు.. సునీత పిటిషన్ కొట్టివేత

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణలో అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు దర్యాప్తు ప్రక్రియ ముగిసిందని సుప్రీంకోర్టుకు సీబీఐ తెలిపింది. ధర్మాసనం ఈ కేసుపై స్పందిస్తూ, విచారణను వేగవంతం చేయాలని ట్రయల్ కోర్టుకు స్పష్టమైన గడువు విధించింది. సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా సీబీఐ తరపు న్యాయవాది కీలక ప్రకటన చేశారు. ఈ కేసులో ఇప్పటికే మూడవ సప్లిమెంటరీ (అదనపు) ఛార్జిషీట్‌ను దాఖలు చేశామని, దీంతో తమ వైపు నుంచి దర్యాప్తు ప్రక్రియ పూర్తయిందని న్యాయస్థానానికి వివరించారు. దర్యాప్తు ముగిసిన నేపథ్యంలో, నిందితుల బెయిల్ రద్దు చేయాలని కోరుతూ గతంలో సీబీఐ, వివేకా కుమార్తె సునీత దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ అవసరం లేదని భావించిన ధర్మాసనం, వాటిని డిస్మిస్ చేసింది.

అయితే, తాము లేవనెత్తిన కొన్ని కీలక అంశాలపై సీబీఐ సరైన దర్యాప్తు చేయలేదని సునీత తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ధర్మాసనం... కేసులోని అంశాలు లేదా ఆధారాలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే నేరుగా ట్రయల్ కోర్టునే ఆశ్రయించాలని సూచించింది. సెక్షన్ 207 కింద ట్రయల్ కోర్టులో దాఖలైన అన్ని పిటిషన్లను పరిశీలించి, విచారణను పూర్తి చేయాలని ఆదేశించింది.

ఈ కేసులో జాప్యాన్ని నివారించేందుకు సుప్రీంకోర్టు ఒక కీలక కాలపరిమితిని విధించింది. ట్రయల్ కోర్టులో పెండింగ్‌లో ఉన్న అన్ని పిటిషన్లపై నాలుగు వారాల్లోగా విచారణ ముగించి, తగిన తీర్పు వెలువరించాలని ఆదేశించింది. అత్యున్నత

న్యాయస్థానం ఇచ్చిన ఈ ఒక నెల గడువుతో, వివేకా హత్య కేసులో రాబోయే 30 రోజులు అత్యంత కీలకం కానున్నాయి. ప్రధాన నిందితులు, కుట్రదారుల విషయంలో ట్రయల్ కోర్టు ఎటువంటి నిర్ణయం తీసుకోబోతుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తికరంగా మారింది.

# ఉగాదికి సామూహిక గృహప్రవేశాలు..

ఆంధ్రప్రదేశ్ లో ఉగాది కానుకగా సామూహిక గృహప్రవేశ కార్యక్రమం నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2.50 లక్షల మందికి లబ్ది చేకూరుతుందని ఆయన తెలిపారు. ఈ మేరకు ఈ రోజు సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఆయన ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ పాలనలో గడిచిన 20 నెలల్లో కీలకమైన పాలనా మార్పులు తీసుకొచ్చినట్లు చెప్పారు. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా 10 సూత్రాల అమలు తీసుకొచ్చామని గుర్తుచేశారు. ప్రభుత్వం తీసుకొచ్చే విధానాలు, పథకాలు దీర్ఘకాలంలో ప్రభావం చూపిస్తాయని.. సూపర్ సిక్స్ సహా వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలని, పథకాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలని కలెక్టర్లకు సీఎం చంద్రబాబు సూచించారు. నిర్దేశిత లక్ష్యాలను క్షేత్రస్థాయిలో ప్రభావవంతంగా, ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా అమలు చేయాలని చెప్పారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో విద్యుత్ చార్జీలను మరింత తగ్గిస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ట్రూఅప్ పేరిట ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం మోపారని చంద్రబాబు విమర్శించారు. కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టాక ట్రూడౌన్ చేశామని, విద్యుత్ చార్జీల భారం మరింత తగ్గించేందుకు కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

# చంద్రబాబు ఉప ప్రధానా?.. జగన్ రియాక్షన్ వైరల్!

- మొదటి పేజి తరువాయి
సోషల్ మీడియాలో చంద్రబాబు జాతీయ రాజకీయ ప్రవేశంపై విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన పదవిని వదులుకుని రాజ్యసభకు వెళ్లవచ్చనే వార్తల నేపథ్యంలో చంద్రబాబు కూడా అదే తరహాలో ఏపీ సీఎం పదవిని వదిలి కేంద్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఈ క్రమంలోనే ఆయన ఉప ప్రధాని అవుతారనే ప్రచారం కూడా జోరందుకుంది. ఈ ప్రచారంపై జగన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# జగన్ చిట్టా కేంద్ర ప్రభుత్వం వద్ద ఉంది

- మొదటి పేజి తరువాయి
ఛిన్నాభిన్నం చేశారు" అని కలిశెట్టి ఆరోపించారు. జగన్ చిట్టా మొత్తం కేంద్రం వద్ద ఉందని, ఆయన ఢిల్లీకి లేఖలు రాసినా ప్రయోజనం ఉండదని అన్నారు.ఐదేళ్ల పాలనలో నకిలీ మద్యం విక్రయాల ద్వారా జగన్ ప్రభుత్వం మహిళల మాంగల్యాలను తెంపిందని కలిశెట్టి విమర్శించారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా జగన్ ఇప్పుడు సంస్కరణల గురించి మాట్లాడుతున్నారని, ఆయన ప్రెస్ మీట్లు పెట్టుకోవచ్చు కానీ ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని హితవు పలికారు.డిప్యూటీ సీఎం చెప్పినట్టు పవన్ కల్యాణ్ చెప్పినట్లుగా భవిష్యత్తు తరాల సంపద కోసం చంద్రబాబు పాలన అవసరమని, అందుకే కూటమి ప్రభుత్వం ఏర్పడిందని కలిశెట్టి పేర్కొన్నారు. పవన్ వ్యాఖ్యలతో జగన్ గుండెల్లో గుబులు మొదలైందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఒకటో తేదీనే జీతాలు, పింఛన్లు ఇస్తోందని.. తల్లికి వందనం, ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్ వంటి పథకాలతో మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని స్పష్టం చేశారు. ఎన్డీయే కూటమిపై అనవసర ఆరోపణలు చేయడం జగన్ మానుకోవాలని ఆయన హెచ్చరించారు.

## ఇరాన్‌తో యుద్ధం త్వరలో ముగుస్తుంది.. నేనెప్పుడు అనుకుంటే అప్పుడే ఆగిపోతుంది

- మొదటి పేజి తరువాయి
త్వరలో యుద్ధం ముగుస్తుందని వ్యాఖ్యానించారు. యాక్సియోస్‌తో ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, నేను ఎప్పుడు యుద్ధం ముగియాలనుకుంటే అప్పుడే ముగుస్తుందని అన్నారు. తమ ఆపరేషన్‌లో ఇరాన్ లక్ష్యాలను అన్నింటిని ఛేదించామని అన్నారు. మరోవైపు, ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ అంతకుముందు రోజు చేసిన వ్యాఖ్యలు విరుద్ధంగా ఉన్నాయి. అవసరమైనంత వరకు, తమ లక్ష్యాలను సాధించే వరకు యుద్ధం కొనసాగుతుందని కాట్జ్ తెలిపారు. ఈ ఆపరేషన్‌ను ఇంత సమయంలో ముగించాలనే కాలపరిమితి ఏదీలేదని తెలిపారు.

# వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్‌పై చీటింగ్ కేసు: చర్చి ట్రస్ట్ పేరుతో రూ. 25 లక్షల మోసం

వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ మరోసారి చట్టపరమైన చిక్కుల్లో చిక్కుకున్నారు. చర్చి ట్రస్ట్ పునరుద్ధరణ పేరుతో భారీ మొత్తంలో డబ్బు తీసుకుని మోసం చేశారనే ఆరోపణలపై విజయవాడలోని సూర్యారావుపేట పోలీసులు ఆయనపై చీటింగ్ కేసు నమోదు చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.కేసు వివరాల్లోకి వెళితే, కాకినాడకు చెందిన సీబీఎన్సీ (CBNC) చర్చి ట్రస్ట్ సభ్యులు, దాని రెన్యువల్ కోసం 2021లో అప్పటి ఎంపీ నందిగం సురేశ్‌ను ఆశ్రయించారు. ఈ పని పూర్తి చేయడానికి సురేశ్ రూ. 25 లక్షలు డిమాండ్ చేశారని, ఆ మేరకు ఉద్దండరాయునిపాలెంలోని ఆయన నివాసంలో నగదు అందజేసినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే, ఏళ్లు గడుస్తున్నా పని పూర్తి కాకపోవడంతో పాటు, ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే ఆయన తమను బెదిరింపులకు గురిచేశారని ట్రస్ట్ సభ్యుడు ఆరోపించారు.బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన సూర్యారావుపేట పోలీసులు, మాజీ ఎంపీపై సెక్షన్ 318(4) (చీటింగ్), 351(2) (నేరపూరిత బెదిరింపు) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటికే అమరావతి భూముల వ్యవహారం, గతంలో జరిగిన దాడుల కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొని, జైలు నుంచి విడుదలైన నందిగం సురేశ్‌కు, ఈ తాజా చీటింగ్ కేసు రూపంలో కొత్త తలనొప్పి మొదలైంది.

# రోడ్లు, డ్రైయిన్ల లో చెత్త వేస్తే భారీ ఫైన్ తప్పదు..కమిషనర్ కె.మయూర్ అశోక్..





పెన్ పవర్, గుంటూరు, మార్చి, 11. యాదవ బజార్, అలీ నగర్, మల్లయ్య లింగం నగర్, పాత గుంటూరు మెయిన్ రోడ్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జిఎంసి ప్రజారోగ్య కార్మికులు ఇంటింటి చెత్త సేకరణకు వస్తున్నారని, కమర్షియల్ సంస్థలు, టిఫిన్ బండ్ల నుండి వ్యర్ధాల సేకరణకు ఏజెన్సీలు ఉన్నపటికీ కొందరు నిర్లక్ష్యంగా రోడ్ల మీద, డ్రైన్లలో వ్యర్ధాలు వేస్తున్నారన్నారు. ప్రజారోగ్య దృష్ట్యా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే గార్బేజ్ వల్నర్బుల్ పాయింట్స్ ని గ్రీనరీ పాయింట్స్ మొక్కలు నాటి అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. శానిటేషన్ కార్యదర్శులు, ఇన్స్పెక్టర్లు తమ పరిధిలో నూరు శాతం చెత్త సేకరణ జరిగేలా, మధ్యాహ్నం డ్రైన్లలో పూడిక తీసే గ్యాంగ్ వర్క్ ని పిన్ పాయింట్ ప్రోగ్రాం మేరకు చేపట్టాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో హోమ్, క్లస్టర్ కంపోస్ట్ ని ప్రోత్సహించాలన్నారు. బయాలజిస్ట్ తో మాట్లాడుతూ అర్బన్ పరిధిలో యాంటీ మలేరియా యాక్టివిటీస్ పక్కాగా జరగాలన్నారు. పట్టణ ప్రణాళిక కార్యదర్శులతో మాట్లాడుతూ నక్ష కార్యక్రమం వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఆస్తి పన్నువసూళ్ల వివరాలను ఆర్ఐ, అడ్మిన్ కార్యదర్శులను అడిగి తెలుసుకొని, మాట్లాడుతూ మార్చి 2వ వారం కూడా గడుస్తున్నందున పన్ను వసూళ్లలో వేగం పెరగాలన్నారు. పన్ను చెల్లించని మొండి బకాయిదారులకు ట్యాప్ డిస్ కనెక్షన్, పెద్ద మొత్తంలోని బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేసి, సీజ్ కి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నీటి కుళాయి, మీటర్ చార్జీల వసూళ్లు నామమాత్రంగానే ఉన్నాయని, అడ్మిన్ లు పూర్తి స్థాయిలో విధుల్లో ఉండి, సచివాలయం పరిధిలో నూరు శాతం పన్ను వసూళ్లు లక్ష్యంగా కృషి చేయాలన్నారు.

వార్డ్ ల వారీగా అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను పూర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో డిప్యూటీ కమిషనర్ జి.సాంబశివరావు, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, కార్పొరేటర్ మీరావలి, ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, ఈఈ(ఇంచార్జి) కళ్యాణరావు, ఎస్ఎస్ అయూబ్ ఖాన్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఐదేళ్ల జగన్ విధ్వంసం నుంచి ప్రజల్ని, రాష్ట్రాన్ని చంద్రబాబు వికాసం దిశగా నడిపిస్తున్నారు : ప్రత్తిపాటి

**సీఎం.ఆర్.ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మాజీమంత్రి ప్రత్తిపాటి.**
**అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడుల ఆకర్షణలో జాతీయస్థాయిలో ఏపీ ప్రతిష్ఠ పెంచారు.**
**రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగున్నాయి.. తాము ప్రశాంతంగా ఉన్నామని ప్రజలే అంటున్నారు.**
**కొండవీడు అభివృద్ధి, మైనారిటీ బాలికల పాఠశాల నిర్మాణం, ఎత్తిపోతల పథకాల నిర్వహణ సహా పలు అంశాలపై ముఖ్యమంత్రితో మాట్లాడాను.**
**ఏడాది, రెండేళ్లలో ప్రాధాన్యతాక్రమంలో అన్నీ పూర్తచేద్దామని సీఎం భరోసా ఇచ్చారు.**

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 11 : చిలకలూరిపేట : జగన్ ఐదేళ్ల విధ్వంసం నుంచి ప్రజలను, రాష్ట్రాన్ని గట్టెక్కించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, జాతీయస్థాయిలో ఏపీ ప్రతిష్ఠ పెంచడంతో పాటు, రాష్ట్రప్రజలకు ధైర్యం, నమ్మకం కల్పించారని, కూటమి ప్రభుత్వంలో ప్రజలు ప్రశాంతంగా, సంతోషంగా గుండెలపై చేయి వేసుకొని నిశ్చింతగా ఉన్నారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో 44 మంది లబ్ధిదారులకు రూ. రూ.30.39 లక్షల విలువైన సీఎం.ఆర్.ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన అనంతరం ప్రత్తిపాటి మీడియాతో మాట్లాడారు. ఎన్టీఆర్ వైద్యసేవలు కాకుండా ఇప్పటివరకు నియోజకవర్గ వ్యాప్తంగా రూ.14.50 కోట్ల ముఖ్యమంత్రి సహాయ నిధి సాయం అర్హులకు అందచేసినట్టు ప్రత్తిపాటి చెప్పారు.

జగన్ విధ్వంసం నుంచి ప్రజల్ని రాష్ట్రాన్ని చంద్రబాబు గట్టెక్కించారు

పనిచేసే ప్రభుత్వం ఉంటే ప్రజలకు ఎలాంటి కష్టాలు రావనేందుకు ఇదే నిదర్శనమన్న ప్రత్తిపాటి, గత ఐదేళ్లలో ప్రజలు బిక్కుబిక్కుమంటూ భయంగా జీవించారని, జగన్ విధ్వంసం నుంచి ప్రజల్ని, రాష్ట్రాన్ని గట్టెక్కించిన చంద్రబాబు, వారికి ధైర్యాన్నిచ్చి, తానున్నాను అనే నమ్మకం, భరోసా కల్పించారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. 20 నెలల్లోనే రాష్ట్రాన్ని వికాసం దిశగా, తిరుగులేని ప్రగతి వైపుగా నడిపిస్తున్నారన్నారు. అభివృద్ధి సంక్షేమంతో పాటు, పెట్టుబడుల ఆకర్షణలో ఏపీకి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ లకే దక్కుతుందన్నారు. కూటమిప్రభుత్వంలో తాము నిర్భయంగా ఉన్నామని, రాష్ట్రంలో శాంతి భద్రతలు బాగున్నాయని ప్రజలే చెబుతున్నారని ప్రత్తిపాటి తెలిపారు.

కొండవీడు అభివృద్ధి, మైనారిటీ బాలికల పాఠశాల నిర్మాణం, ఎత్తిపోతల పథకాలపై సీఎంతో మాట్లాడాను

మంగళవారం ముఖ్యమంత్రితో జరిగిన పల్నాడు జిల్లా అభివృద్ధి సమావేశంలో పలు నియోజకవర్గ అభివృద్ధి అంశాలు సీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు ప్రత్తిపాటి చెప్పారు.



కొండవీడు అభివృద్ధి, మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం, ఎత్తిపోతల పథకాల నిర్వహణ, ప్రధాన లింకురోడ్ల నిర్మాణం సహా, పలు సమస్యలను ముఖ్యమంత్రికి విన్నవించగా, వచ్చే ఏడాది..రెండేళ్లలో అన్నీ ప్రాధాన్యతాక్రమంలో పూర్తిచేద్దామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చినట్టు ప్రత్తిపాటి తెలియచేశారు.

కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బత్తినేని శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు గంజి శ్రీనివాసరావు, బేరింగ్ మౌలాలి, అజారుద్దీన్, తుపాకుల అప్పారావు, మస్తాన్ వలి, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మాదిగ బిడ్డలకు అండగా ఎమ్మార్పీఎస్

## అనారోగ్యంతో ఉన్న మహిళకు రూ. 1.70 లక్షల ఆర్థిక సాయం

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 11 : నాదెండ్ల : కష్టాల్లో ఉన్న మాదిగ కుటుంబాలకు ఎమ్మార్పీఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ చాటి చెప్పారు. పల్నాడు జిల్లా నాదెండ్ల గ్రామానికి చెందిన బుదాల మరియదాసు భార్య షాలిని గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆ కుటుంబం పడుతున్న ఆర్థిక ఇబ్బందులను గమనించిన ఎమ్మార్పీఎస్ నాయకత్వం పెద్ద మనసుతో స్పందించింది. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ చేతుల మీదగాఘనంగా చెక్కు పంపిణీ చిలకలూరిపేట నియోజకవర్గ అధ్యక్షులు కొండమోది సురేష్ మాదిగ ఆధ్వర్యంలో, పలువురు దాతలు మరియు పెద్దల సహకారంతో సేకరించిన రూ. 1,70,000 (లక్షా డెబ్బై వేల రూపాయల) చెక్కును బుధవారం నాడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ గారి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు.

ఐక్యమత్యమే మహాబలం – అండగా నిలిచిన నాయకులు

ఈ సేవా కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు కంభంపాటి గురవయ్య, బోదాల చిన్న శ్రాయేలు, దావులూరి బుల్లయ్య, దావులూరి వెంకటేశ్వర్లు, బుదాల పెన్నయ్య, తానికొండ కోటేశ్వరరావు మరియు ఇతర పెద్దలు విశేషంగా కృషి చేశారు. తమ వంతు సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోట సుబ్బు మాదిగ, పల్నాడు జిల్లా అధ్యక్షులు



గుండాల నగేష్ మాదిగ, మాదిగ మహిళా జిల్లా అధికార ప్రతినిధి బొంత రాణి మాదిగ, సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ పలుకూరి రామారావు మాదిగ, మరియు నరసరావుపేట మండల అధ్యక్షుడు వేశ పోగు తిమోతి మాదిగ పాల్గొన్నారు.

# వాగులోకి దూసుకెళ్లిన కారు -- ఆరుగురికి తీవ్రగాయాలు

దాచేపల్లి (పల్నాడు జిల్లా) : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 11: కారు అదుపుతప్పి వాగులోకి దూసుకెళ్లడంతో ఆరుగురు ప్రయాణీకులకు తీవ్రగాయాలైన ఘటన బుధవారం పల్నాడు జిల్లా దాచేపల్లిలో జరిగింది. హైదరాబాద్ నుండి తిరుపతికి వెళుతున్న కారు అద్దంకి నార్కెట్పల్లి హైవే పై ప్రయాణిస్తుండగా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని అదుపుతప్పి నల్లవాగు కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాద సమయంలో కారులో ఉన్న ఆరుగురు ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. అత్యవసర చికిత్స నిమిత్తం వారిని హుటాహుటిన 108 వాహనంలో గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా। ఎన్.టి.ఆర్. జిల్లా। గుంటూరు జిల్లా। పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# చిలకలూరిపేట మున్సిపాలిటీలో అపరిశుభ్ర రాజకీయం

## కాగితాల్లోనే కార్మికులు.. జేబుల్లోకి జీతాలు!?



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 11 : చిలకలూరిపేట : తెల్లవారక ముందే "అయ్యా.. వచ్చానయ్యా.. ఎస్సార్!" అంటూ పారిశుధ్య కార్మికుల పిలుపులతో మున్సిపల్ కార్యాలయం ప్రతిధ్వనిస్తుంది. అటెండెన్స్ వేయించుకుని, కొందరి మార్గదర్శకత్వంలో వార్డుల బాట పట్టే కార్మికులు చేసే సేవ వెలకట్టలేనిది. వారు ఒక్కరోజు రాకపోతేనే పట్టణం దుర్వాసనతో నిండిపోతుంది. కానీ, అదే కార్మికుల ముసుగులో చిలకలూరిపేట మున్సిపాలిటీలో కొందరు అధికారులు సాగిస్తున్న అక్రమాల పర్వం ఇప్పుడు పట్టణంలో హాట్ టాపిక్ గా మారింది.

ఘోస్ట్' వర్కర్ల హల్చల్.. అటెండెన్స్ పక్క రాష్ట్రంలో!?

మున్సిపాలిటీలో ముఖ్యంగా శానిటేషన్ డివిజన్-2 పరిధిలో వింతలు, విశేషాలు వెలుగుచూస్తున్నాయి. సుమారు 160మంది అవుట్సోర్సింగ్, మరి కొంతమంది పర్మనెంట్ కార్మికులు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది.

పక్క రాష్ట్రంలో ఉంటూ ఇక్కడ జీతం

ఈ డివిజన్లో పనిచేసే ఒక మహిళా కార్మికురాలి పేరు అటెండెన్స్ రిజిస్టర్లో ఉంటుంది కానీ, ఆమె మాత్రం పక్క రాష్ట్రంలో నివసిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

అజ్ఞాత కార్మికులు

మరో నలుగురు కార్మికులు అటెండెన్స్ పలుకుతారు కానీ, వారు అసలు ఎవరో, ఎక్కడ ఉంటారో తోటి కార్మికులకు కూడా తెలియదు.(కొన్ని కారణాల వల్ల వారి పేర్లు వార్త లో పెట్టటం లేదు)ఉన్నతాధికారులు తనిఖీకి వస్తే, అక్కడ ఉన్న ఇతర వర్కర్లే వారి పేర్లు పలకడం ఇక్కడ రివాజుగా మారింది.

అధికారుల ముందు జాగ్రత్త

ఒక కార్మికుడికి జనవరి 15 నుండి అటెండెన్స్ వేయకుండా నిలిపివేయడం అధికారుల డొల్లతనం బయటపడుతుందని మచ్చరు ను నిలిపివేశారు.

అధికారుల జేబుల్లోకి కార్మికుల కష్టం?

అటెండెన్స్ వేయించుకుని వెంటనే పది నుండి ఇరవై మంది ఇళ్లకు వెళ్లిపోతుంటారని సమాచారం. ఇలా పనిచేయని రోజులకు గాను, ఒక్కో కార్మికుడి నుండి సుమారు 500 రూపాయల చొప్పున అధికారుల జేబుల్లోకి వెళ్తున్నట్లు కార్మికుల మధ్య గుసగుసలు వినిపిస్తున్నాయి. "అటెండెన్స్ మాది.. ఆదాయం అధికారులది" అన్నట్లుగా ఇక్కడ పరిస్థితి తయారైంది.

కొండల సాకు.. పట్టణంలో నరకం!

ఇటీవల పట్టణంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, మురుగు కాలువలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే.. "కోటప్పకొండ, కొండవీడు, సీఎం మీటింగ్ డ్యూటీలతో బిజీగా ఉన్నాం.. అందుకే పట్టణాన్ని పట్టించుకోలేకపోయాం" అంటూ నిర్లక్ష్యపు సమాధానాలు ఇస్తున్నారు. గత కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ కునల ప్రమీల సైతం, "డివిజన్ కు 180 మంది కార్మికులు ఉన్నప్పుడు, రెండు,మూడు వీధుల్లో కేవలం ఇద్దరే ఎందుకు కనిపిస్తున్నారు?" అని నిలదీయడం ఈ అక్రమాల తీవ్రతను చాటిచెబుతోంది.

ప్రజాధనం ఏమవుతోంది?

ఒకవైపు యూజర్ చార్జీల పేరుతో ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్న అధికారులు, మరోవైపు పారిశుధ్య కార్మికుల పేర్లతో ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని, సమగ్ర విచారణ జరిపి, ఈ 'అవినీతి తిమింగలాల' నుంచి ప్రభుత్వ సొమ్మును రికవరీ చేయాలని రాజకీయ పార్టీల నేతలు మరియు పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గమనిక

ఒక డివిజన్ ఒక ఏరియాలోనే ఈ విధంగా ఉంటే, మరి మిగతా డివిజన్లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో తెలియాల్సి ఉంది.

# పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు వాడ వాడలా ఆవిర్భావ వేడుకలను నిర్వహిద్దాం..ఆళ్ళ హరి...



పెన్ పవర్, గుంటూరు, మార్చి, 11. ప్రతీ గుండెను తాకేలా జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలను నిర్వహిద్దామని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు . పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు పార్టీ 13 వ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రజా వేడుకలా వాడ వాడలా జరపాలని పార్టీ శ్రేణుల్ని అయన కోరారు. బుధవారం శ్రీనివాసరావుతోటలో పార్టీ శ్రేణులతో అయన సమావేశం అయ్యారు. పార్టీ ఆదేశాల మేరకు జెండా ఆవిష్కరణలు , సేవా కార్యక్రమాలు, రక్తదానం వంటి కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ జనసేన స్థాపించిన దగ్గర నుంచి ఇప్పటివరకు సాగిన ప్రయాణాన్ని పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించాలన్నారు పార్టీ సిద్ధాంతాలను , పవన్ కళ్యాణ్ సాధించిన విజయాలను ప్రజాక్షేత్రంలో చర్చించాలన్నారు. భవిష్యత్ ప్రణాళికలపై క్షేత్రస్థాయిలో ప్రజాభిప్రాయాన్ని సేకరించాలన్నారు పవన్ కళ్యాణ్ అద్వితీయ నాయకత్వానికి ప్రజల నుంచి మరింత మద్దతు కోరుదామని సూచించారు. దేశ రాజకుయాల్ని సైతం ప్రభావితం చేసిన పవన్ కళ్యాణ్ రాజకీయ చతురత భవిష్యత్ నాయకులకు ఆదర్శనీయమన్నారు. జనసేన ఆవిర్భావంతో రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని, భవిష్యత్తు రాజకీయాలు జనసేనవేనని ఆళ్ళ హరి అన్నారు. పార్టీ నాయకులు మారుతీ కిషోర్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ లాంటి మహోన్నతమైన నాయకుడితో ప్రయాణం ప్రతీ ఒక్కరికీ గర్వకారణమన్నారు. ఆవిర్భావ వేడుకలను అవకాశం ఉన్నంత మేరకు ప్రజల మధ్యలో జరుపుకునేలా కృషి చేయాలని కిషోర్ అన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి షేక్ మెహబుబ్ బాషా , వడ్డే సుబ్బారావు, పగిడిపోగు రమేష్ , నందూరి స్వామి , జక్కా రాఘవులు , ఇళ్ళా చిరంజీవి , స్టూడియో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# 7.6 కేజీల గంజాయి పట్టుకున్న నల్లపాడు పోలీసులు...



పెన్ పవర్, గుంటూరు, మార్చి, 11. చోడవరం గ్రామంలో గంజాయి నీ పట్టుకున్న నల్లపాడు పోలీసులు మరియు టాస్క్ ఫోర్స్ సిబ్బంది 14 మంది యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఇప్పటి వరకు 51 కేసులలో 300 మందిని రిమాండ్ కు పంపడం జరిగింది గంజాయి అమ్ముతున్న 8 మంది పై పీడీ యాక్టు పెట్టడం జరిగింది గంజాయి సేవించడం వలన కలిగే నష్టాలను విద్యార్థులలో సంకల్పం.అనే కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నాం కేసు పురోగతికి పాల్పడిన పోలీసులకు ప్రశంసా పత్రాలు అందించిన ఎస్పీ...

## రంపఎర్రం పాలెం పాఠశాలకు ఫర్నిచర్ పరీక్షకి కి ట్లు బహుకరణ





గోకవరం పెన్ పవర్ ప్రతినిధి మార్చి 11: స్థానికరంరంపయర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనందు పదో తరగతి విద్యార్థులకు ఫేర్వెల్ డే పార్టీ హెచ్ఎం కలుం అబ్బులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులు పాఠశాలకు 12 వేల రూపాయలు విలువచేసే బీరువాను సర్పంచ్ బాదంపూడి హర్షిత ప్రకాష్, ఎస్ఎంసి ఛైర్మన్ గంటా శ్రీను, స్కూల్ వెట్ ప్రెసిడెంట్ కాకర విష్ణు,చేతుల మీదుగా స్వీకరించడం జరిగింది.బహుకరించడం జరిగింది. అదేవిధంగా పాఠశాల పూర్వ విద్యార్థులు సాఫ్ట్వేర్ ఇంజనీర్లు అయిన పలివెల దేవి మనీషా, ఎలమంచిలి సాయి దుర్గ, పెనుగొండ స్మైలి లు 8000 రూపాయలతో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు వ్రాయటానికి పరీక్ష కిట్లు 85 మంది ఎస్ ఎస్ సి విద్యార్థులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల స్టాఫ్ సెక్రటరీ పెదిరెడ్ల రాజు మాట్లాడుతూ ఎస్ ఎస్ సి పరీక్షలులో మంచి ఉత్తీర్ణత సాధించాలని, మంచి విలువలుతో ముందుకు వెళ్లాలని తెలియజేసారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ,వరలక్ష్మి, కిరణ్ బాబు,భాస్కరరావు, సుబ్బారావు, రాంబాబు,ప్రకాశరావు దొర, బాల సుబ్రహ్మణ్యం, బాలు దొర, ఆదిరెడ్డి, రామకృష్ణ, పెనుగొండ కుమారి, లక్ష్మీకాంతం,బాలు మొదలగు వారు పాల్గొన్నారు.

## మిషన్ శక్తి కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలకు అవగాహన



పశ్చిమగోదావరి జిల్లా: పెనుగొండ పెన్ పవర్ ప్రతినిధి మార్చి 11:: పెనుగొండ గ్రామంలోని పెనుగొండ--3 సచివాలయం పరిధిలో మిషన్ శక్తి కార్యక్రమం భాగంగా అంగన్వాడి సిబ్బంది ఆధ్వర్యంలో గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారుల తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్యవివాహాల దుష్పరిణామాలు వంటి అంశాలపై వివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐసిడిఎస్ సిడిపిఓ ఎ. కృష్ణకుమారి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ద్వారా తల్లి-శిశువుల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ఎంతో అవసరమని సూచించారు. బాల్యవివాహాలు సమాజానికి హానికరమని, ప్రతి ఒక్కరూ వాటిని అరికట్టేందుకు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం పాల్గొన్న మహిళలకు అవగాహన కల్పించేందుకు క్విజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ టి. పోచమ్మ, ఏఎన్ఎం స్వర్ణలత, అంగన్వాడి సిబ్బంది, ఆశ కార్యకర్తలు మరియు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## తృటిలో తప్పిన ప్రమాదం జె సికిలె బస్సు కింద మోపెడ్...




సఖినేటిపల్లి పెన్ పవర్ ప్రతినిధి మార్చి 11: డా బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం మూడుతూముల కాలువ రోడ్డు లో పాముల్లోల కాలువ పై ఉన్న వంతెన కార్నర్లో యాక్టివా మోటార్ సైకిల్ బస్సు టైర్ కింద పడింది. డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల స్పీడుగా మలుపు తిప్పడం వల్ల ఈ యాక్సిడెంట్ అయినట్లు స్థానికులు తెలియజేశారు. స్కూటర్ నడుపుతున్న వ్యక్తి కాలువ నీటిలో పడి నట్లు, సురక్షితం గా ఉన్నారు. పిల్లలు ఉన్న బస్సు ను అంత నిర్లక్ష్యంగా డ్రైవర్ వ్యవహరించడం బాధాకరమని, అధికారులు బస్సులపై తగు చర్యలు తీసుకోవాలని, బిజెపి మండలాధ్యక్షులు పి సురేష్ పత్రికా సమావేశంలో తెలియజేశారు.

## సూరేపల్లి గ్రామంలో “పంటకోత.. విలువ జోడింపు”పై అవగాహన.



భట్టిప్రోలు పెన్ పవర్ ప్రతినిధి మార్చి 11:భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామంలో మండల ఇంచార్జ్ వ్యవసాయ అధికారి కె.లక్ష్మి ప్రసన్న అధ్యక్షతన,రేపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ లక్ష్మీ ఆధ్వర్యంలో పంట కోత,నిర్వహణ విలువ జోడింపు పై రైతులకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ ప్రస్తుతం సాగు చేసిన మినుము,పెసర, మొక్కజొన్న పంట లో సస్యరక్షణ చర్యలు వివరించారు. అనంతరం పంటకోత సరైనదశలో చేయటం వలన పంట ఉత్పత్తుల నిల్వ ఉంచే కాలం ఎక్కువగా ఉంటుందని కావున మినుము,పెసర పంట కోత 80-85 శాతం కాయలు నల్లబడిన తరువాత చేసుకోవాలని,అదే మొక్కజొన్నలో అయితే..కండె గింజ గట్టిపడిన తరువాత చేసుకోవాలన్నారు - ఇలా పంట సరైన దశలో కోత కోయుట వల్ల పంట ఉత్పత్తులకు నాణ్యత బాగుంటుందని తెలిపారు. అదే విధంగా మనం పండించిన అపరాలు, మొక్కజొన్న వంటి పంటలను గ్రామస్థాయిలో స్వయం సహాయక సంఘాలు లేదా ఎఫ్ ఆర్ వో ల ద్వారా విలువ జోడింపు చేసి అమ్ముకుంటే అదనపు ఆదాయం లభిస్తుందని తెలియపరిచారు. అపరాల్లో కుంటలను రాళ్ళు,మట్టిగడ్డలు తీసేసి గ్రేడింగ్ చేయటం,పైన పొట్టు తీయటం,పప్పు విడగొట్టడం,పిండి తయారీ, మొలకల తయారీ వంటివి గ్రామస్థాయిలో చేసుకుని బాహ్య మార్కెట్లో అధికధర-అమ్ముకోవచ్చని తెలిపారు. అదేవిధంగా మొక్కజొన్న కండె నుండి గింజలను వేరుచేయటం పిండి తయారీ,పాప్కార్న్ వంటి ఎక్కువ డిమాండ్ కలిగిన ఉత్పత్తులను తయారు చేసి స్థానిక సంతలు,రైతు బజార్ల ద్వారా నేరుగా వినియోగదారునికి అమ్ముకోవటం ద్వారా మధ్యవర్తులు లేక పోవటం వల్ల అవవస్థ ఆదాయం లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మి,డి ఎ ఎ టి టి సి సెంటర్ శాస్త్రవేత్త కె. అచ్యుత రాజు,విఎవి నఫీసా,గ్రామంలోని అభ్యుదయ రైతులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.


## విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం -- ఆర్ఆర్ పేట ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ



పశ్చిమగోదావరి జిల్లా: పెనుగొండ: పెన్ పవర్ ప్రతినిధి మార్చి 11:: పెనుగొండ మండలం ఆర్ఆర్ పేటలోని ప్రాథమిక పాఠశాలను ఆచంట నియోజకవర్గ ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించి, ఆహార నాణ్యత మరియు పరిశుభ్రతపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు పోషకాహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అనంతరం పాఠశాల భవనం పరిస్థితిని పరిశీలించిన ఎమ్మెల్యే, అవసరమైన మరమ్మతులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే విద్యార్థులు పాఠశాలకు సౌకర్యంగా రాకపోకలు సాగించేలా పాఠశాల పరిసర మార్గాలను శుభ్రం చేసి గ్రావెల్ వేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. విద్యా సంస్థల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మండ ప్రసాద్, స్థానిక కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీకు జాతీయ ఎస్సీ కమిషన్ నోటీసులు..

అమలాపురం, పెన్ పవర్ ప్రతినిధి మార్చి 11: డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేట మండల గంటి పెదపేట గ్రామానికి చెందిన దళిత యువకులపై దాడికి పాల్పడిన నిందితులను వదలి కేవలం దళిత యువకులపైనే కేసులు కట్టి కస్టోడియల్ టార్చర్కు గురిచేశారని జాతీయ ఎస్సీ కమిషన్కు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై కోనసీమ జిల్లా ఎస్పీకు నోటీసులు అందాయి.. ఈ మేరకు ఫిర్యాదు దారుడైన నక్కా రామకళ్యాణ్కు జాతీయ ఎస్సీ కమిషన్ నుంచి నోటీసులు మంగళవారం అందాయని వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ వెల్లడించారు.. ఇటీవల జాతీయ ఎస్సీ కమిషన్ దిండి గ్రామం విచ్చేసిన క్రమంలో ఈ కేసుకు సంబందించి ఈ ఫిర్యాదును చేశారు. దీనిపై తక్షణం స్పందించిన కమిషన్ కేసుకు సంబందించి పూర్వాపరాలు తెలియజేయాలని ఎస్పీకు నోటీసులు జారీ చేస్తూ ఆదేశించింది.. కేసులో ఘటన ఏరోజున జరిగింది..పూర్తి వివరాలు తెలియజేయాలని, బాధితుల పేర్లు,



Government of India
National Commission for Scheduled Castes
(A Constitutional body set up under Article 338 of the Constitution of India)
(Jurisdiction: Telangana,Andhra Pradesh, Madhya Pradesh & Chhattisgarh)
906,C.G.O.TOWERS,KAVADIGUDA,HYDERABAD-500080
Tele:(040)27534907,29561965 (Fax):040-29561965
Toll Free No. 1800-1800-345
Email:ncsc.ap@nic.in

File No. APCR/IP/AP/2026/326132

Date : 10/03/2026

Notice

To

The Superintendent of Police
Dr.Ambedkar Konaseema Dist
Andhra Pradesh .
supdtmagl.ksm@gmail.com
dcrbkonaseema@gmail.com

Sub: Harassment by the Police

Sir/Madam,

Whereas a Complaint/information has been received by the National Commission for Scheduled Castes from Shri/Smt Nakka Rama Kalyan and Others dated: 10/03/2026 as enclosed and the Commission has decided to investigate/inquire into the matter in pursuance of the powers conferred upon it under Article 338 of the Constitution of India.

You are hereby requested to submit action taken report to the undersigned within 30 Days of receipt of this notice either by NCSC Portal/Post/Email (Email : ncsc.ap@nic.in ) or in person in the following format.

| S.No. | Date of Incident/ Thana and Brief details & nature of crime | Name & Address of Victim | Name of all Accused | Details of Action | | | Details of Compensation Amount given to Victim & date as per PoA Act and Rules by District Magistrate/Collector |
|---|---|---|---|---|---|---|---|
| | | | | FIR no & Date and Sections | No. of accused arrested & date | No. & date of Charge sheet Section of final report | |
| | | | | | | | |

Full detailed report to be given in an annexure.

Please take notice that in case the Commission does not receive reply from you within the stipulated time, the Commission may exercise the powers of Civil Courts conferred on it under Article 338 of the Constitution of India and issue summons for your appearance in person or by a representative before the Commission.

Encls: As above.

Yours faithfully

Copy for information :

Dr.G.Sunil Kumar Babu
DIRECTOR

Nakka Rama Kalyan and Others,H.No. 6-105/1 Gantipedapeta Village, Kothapeta Mandal, DR. BR. Ambedkar Konaseema District, Andhra Pradesh,--Select--,Konaseema,Andhra Pradesh,

అడ్రస్లు, నిందితుల వివరాలు, ఎఫ్ ఐ ఆర్ నమోదుచేసిన తేదీ, ఏసెక్షన్లు కింద కేసు నమోదయ్యింది.. నిందితుల అరెస్ట్ వివరాలు, చార్జిషీట్ ఫైనల్ రిపోర్ట్ తోపాటు బాధితులకు ఏవిధమైన పరిహారం అందించారన్న వివరాలు 30 రోజుల్లోగా తెలపాలని ఆదేశించింది.. తమ ఫిర్యాదుపై జాతీయ ఎస్సీ కమిషన్ స్పందించడంపై ఫిర్యాదు దారులు హర్షం వ్యక్తం చేశారు.


## సూరేపల్లి గ్రామంలో “పంటకోత.. విలువ జోడింపు”పై అవగాహన

భట్టిప్రోలు, పెన్ పవర్ మార్చి, 11: భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామంలో మండల ఇంచార్జ్ వ్యవసాయ అధికారి కె.లక్ష్మి ప్రసన్న అధ్యక్షతన,రేపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ లక్ష్మీ ఆధ్వర్యంలో పంట కోత,నిర్వహణ విలువ జోడింపు పై రైతులకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ ప్రస్తుతం సాగు చేసిన మినుము,పెసర, మొక్కజొన్న పంట లో సస్యరక్షణ చర్యలు వివరించారు. అనంతరం పంటకోత సరైనదశలో చేయటం వలన పంట ఉత్పత్తుల నిల్వ ఉంచే కాలం ఎక్కువగా ఉంటుందని కావున మినుము,పెసర పంట కోత 80-85 శాతం కాయలు నల్లబడిన తరువాత చేసుకోవాలని,అదే మొక్కజొన్నలో అయితే..కండె గింజ గట్టిపడిన తరువాత చేసుకోవాలన్నారు - ఇలా పంట సరైన దశలో కోత కోయుట వల్ల పంట ఉత్పత్తులకు నాణ్యత బాగుంటుందని తెలిపారు. అదే విధంగా




మనం పండించిన అపరాలు, మొక్కజొన్న వంటి పంటలను గ్రామస్థాయిలో స్వయం సహాయక సంఘాలు లేదా ఎఫ్ ఆర్ వో ల ద్వారా విలువ జోడింపు చేసి అమ్ముకుంటే అదనపు ఆదాయం లభిస్తుందని తెలియపరిచారు. అపరాల్లో కుంటలను రాళ్ళు,మట్టిగడ్డలు తీసేసి గ్రేడింగ్ చేయటం,పైన పొట్టు తీయటం,పప్పు విడగొట్టడం,పిండి తయారీ, మొలకల తయారీ వంటివి గ్రామస్థాయిలో చేసుకుని బాహ్య మార్కెట్లో అధికధర-అమ్ముకోవచ్చని తెలిపారు. అదేవిధంగా మొక్కజొన్న కండె నుండి గింజలను వేరుచేయటం పిండి తయారీ,పాప్కార్న్ వంటి ఎక్కువ డిమాండ్ కలిగిన ఉత్పత్తులను తయారు చేసి స్థానిక సంతలు,రైతు బజార్ల ద్వారా నేరుగా వినియోగదారునికి అమ్ముకోవటం ద్వారా మధ్యవర్తులు లేక పోవటం వల్ల అవవస్థ ఆదాయం లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మి,డి ఎ ఎ టి టి సి సెంటర్ శాస్త్రవేత్త కె. అచ్యుత రాజు,విఎవి నఫీసా,గ్రామంలోని అభ్యుదయ రైతులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ చేసిన మండలనేని చరణ్ తేజ

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 11 : చిలకలూరిపేట : పట్టణంలోని శ్రీ శారద జిల్లా పరిషత్ హై స్కూల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో మొత్తం 161 మంది విద్యార్థులకు ప్యాడ్, పెన్, స్కేలు వంటి అవసరమైన పరీక్షా సామగ్రిని ప్రముఖ పారిశ్రామికవేత్త, జనసేన నాయకుడు మండలనేని చరణ్ తేజ అందించారు. ఈ సామగ్రిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. రత్నజ్యోతి విద్యార్థినీ, విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలనేని చరణ్ తేజ మాట్లాడుతూ విద్యార్థులు రాబోయే పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు తన శు



భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్పర్సన్ పిల్లి ధనలక్ష్మి, తోట వెంకట సురేష్, తూబాటి పరమేశ్వరి, ముత్తంశెట్టి ప్రసాద్, తోట మల్లికార్జునరావు, నల్లమల్ల ఉదయలక్ష్మి, వట్టిప్రోలు శ్రావణి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో పాఠశాల తరఫున ప్రధానోపాధ్యాయులు కే. రత్నజ్యోతి కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## త్రాగునీటి సరఫరాపై కమిషనర్ పరిశీలన

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 11 : చిలకలూరిపేట : పట్టణ ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు రాగన్నపాలెం, వాసవి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజలకు అందుతున్న త్రాగునీటి నాణ్యతపై ఆరా రాగన్నపాలెం మరియు వాసవి నగర్ ఏరియాలలో పర్యటించిన కమిషనర్, ఇంటింటికీ సరఫరా అవుతున్న త్రాగునీటిని స్వయంగా తనిఖీ చేశారు. నీరు ఏ విధంగా వస్తుంది? రంగు ఏమైనా మారుతుందా? లేదా దుర్వాసన వస్తుందా? అని స్థానిక మహిళలను అడిగి తెలుసుకున్నారు.

అన్నా క్యాంటీన్లో భోజన నాణ్యత పరిశీలన



అనంతరం పట్టణంలోని అన్నా క్యాంటీన్ను కమిషనర్ సందర్శించారు. అక్కడ భోజనం చేస్తున్న వారితో మాట్లాడి, భోజనం రుచిగా ఉందా? నాణ్యత ఎలా ఉంది? అని ఆరా తీశారు. పేదలకు అందించే ఆహారం విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని నిర్వాహకులకు స్పష్టం చేశారు.క్యాంటీన్ పరిసరాలను పరిశీలించిన కమిషనర్, చుట్టుపక్కల వాతావరణం అత్యంత పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు.

## జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు చెయ్యని తప్పు చేయని అప్పు లేదు...రాచకొండ లక్ష్మయ్య..

పెన్ పవర్, గుంటూరు, మార్చి, 11. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు : చెయ్యని నేరం లేదు వర్తింపని సెక్షన్లు లేదుపట్టుకొని కాళ్ళు లేవుఎక్కని కోర్టు మెట్లు లేవుతప్పుదొర్లని ప్రెస్మీట్ లేదుస్క్రిప్ట్ లేని ప్రెస్మీట్ లేదుబూతులు లేని ప్రసంగం లేదువాడని ఆయుధం లేదు చెయ్యని కల్తీ లేదుదోచుకొని వనరులు లేవుబొక్కలు లేని రోడ్లు లేవు స్కాములు లేని స్కీంలు లేవు కట్టని పరదాలు లేవుపెట్టుకొని నలహాదారు లేరుకొనసాగించిన పథకం లేదుజె బ్రాండ్ కు పెట్టని పేరు లేదు రంగులు వేయని భవనం లేదు స్టిక్కర్ వేయని వస్తువు లేదు వాడని డాంబికం లేదుఇంట్లో సొంత మనుషులు లేరుచంపని సాక్షం లేదు ఎంపీ లు ప్రతిపక్షీ లొనే లేరు శాఖల గురించి తెలిసిన మంత్రి వర్గం లేదుతిట్టించని కులం లేదునీ కోసం వాడని మతం లేదుప్రతిష్ఠ దెబ్బతీయని హిందూ దేవాలయం లేదుఅసెంబ్లీలో తిట్టని రోజే లేదుపెట్టని ముద్దు లేదు ఇవ్వని హామీ లేదుఅప్పు అడగని బ్యాంక్ ఏ లేదుతాకట్టు పెట్టని భూమి లేదుకట్టని ప్యాలస్ లేదు



అవమానించని సెలెబ్రెటీ లేదు భయపించని స్లోగన్ లేదుబాగుపడ్డ రైతు లేదునిందలు వేయని భార్య లేదు బెదిరించని పోటీ దారుడు లేదు వేయని పన్నులు లేవుకూల్చని కట్టడం లేదుఅణిచివేయని ఉద్యమం లేదు చేయని దౌర్జన్యం లేదుపోలవరం ఊసే లేదురాజధాని కి గతే లేదు కార్పొరేషన్ లకి కొదవే లేదు సేకరించని సంతకం లేదు జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు....

# బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ను అందించండి.ఎమ్మెల్యే దేవ



సఖినేటిపల్లి పెన్ పవర్ ప్రతినిధి మార్చి 11: అంబెద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం, సఖినేటిపల్లి మండలం మోరి గ్రామంలోని మోరి పి హెచ్ సి లో ఈరోజు ఉదయం 14 15 సంవత్సరాల వయస్సు గల బాలికలకు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌ను నివారించే హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ను శాసనసభ్యులు దేవ వరప్రసాద్ ప్రారంభించారు. బాలికల ఆరోగ్య రక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకుని, తల్లిదండ్రులు తమ కుమార్తెలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పాలువాయిగేటు, మంచికల్లు గ్రామాలలో చోరీలు...



రెంటచింతల పెన్ పవర్ ప్రతినిధి మార్చి 11: మండలం లోని పాలువాయిగేటు, మంచికల్లు గ్రామాలలో దొంగలు మంగళవారం రాత్రి హల్ చల్ చేసి చోరీలకు పాల్పడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలువాయిగేటు గ్రామానికి చెందిన జి. యాలాద్రి తన భార్య లక్ష్మీపార్వతితో కలిసి ఉదయం కూలీ పనులకు వెళ్లి సాయంత్రం వచ్చే సరికి ఇంటికి వేసిన తాళం పగలగొట్టి బీరువాలో నున్న 40 గ్రాముల బంగారం, రూ.70 వేల నగదు, 19 తులాల వెండి వస్తువులు అవహరించారని బాదితులు వాపోయారు. మంచికల్లు గ్రామంలో తుపాకుల గోపిచంద్ నివాసానికి ఉన్న తాళం కూడ పగలగొట్టి రూ.30 వేలు నగదు, బంగారపు రెండు ఉంగరాలు, చెవి బుట్టలుతో పాటు వెండి పట్టీలు, 50 కేజీల బియ్యం దోచుకువెళ్లారు. గోపిచంద్ ఓ ప్రైవేటు డ్రైవర్ గా వారం రోజుల కిందట గ్రామం విడిచిపోగా అతని భార్య కళ్యాణి గర్భవతి కావడంతో పుట్టింటికి వెళ్లగా ఈ చోరి జరిగింది. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు జిల్లా నుంచి వచ్చిన క్లూస్ టీం దొంగలకు సంబంధించిన వివరాలను, వేలిముద్రలను సేకరించారు. చోరీలకు పాల్పడిన దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. మండల. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామం విడిచి రెండు మూడు ఈజుల పాటు మరో ఊరు వెళ్ళేవారు పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని కోరారు.

# 7.6 కేజీల గంజాయి పట్టుకున్న నల్లపాడు పోలీసులు...



పెన్ పవర్, గుంటూరు, మార్చి, 11. చోడవరం గ్రామంలో గంజాయి నీ పట్టుకున్న నల్లపాడు పోలీసులు మరియు టాస్క్ ఫోర్స్ సిబ్బంది 14 మంది యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఇప్పటి వరకు 51 కేసులలో 300 మందిని రిమాండ్ కు పంపడం జరిగింది గంజాయి అమ్ముతున్న 8 మంది పై పీడీ యాక్టు పెట్టడం జరిగింది గంజాయి సేవించడం వలన కలిగే నష్టాలను విద్యార్థులలో సంకల్పం.అనే కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నాం కేసు పురోగతికి పాల్పడిన పోలీసులకు ప్రశంసా పత్రాలు అందించిన ఎస్పీ...

01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# జాతీయ మహిళా సదస్సులో చల్లపల్లి సర్పంచ్ కృష్ణకుమారి



చల్లపల్లి (కృష్ణా) : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 11:అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ... కేంద్ర ప్రభుత్వం దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహిస్తున్న మహిళా జాతీయ సదస్సులో కృష్ణా జిల్లా తరపున చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి బుధవారం పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి 13 మంది ప్రజాప్రతినిధులను, ఆరుగురు మహిళా అధికారులను సదస్సులో పాల్గొనేందుకు ఎంపిక చేశారు. వారిలో కృష్ణకుమారి ఒకరు. ఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్లో మహిళా ప్రజాప్రతినిధుల జాతీయ సదస్సు జరుగుతుంది. మహిళా నాయకత్వాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో పరిపాలనలో మహిళా ప్రజాప్రతినిధులు అనుభవాలను, పాలనా సామర్థ్యం, నాయకత్వం గురించి జాతీయ సదస్సులో చర్చించటం, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, కేంద్రమంత్రుల ప్రసంగాలతో పాటు మినిట్ టు మినిట్ కార్యక్రమాలు జాతీయ సదస్సులో జరుగనున్నాయి.

# హమాలీల కూలి రేట్లు పెంచాలి



అమరావతి : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 11: సివిల్ సప్లయిస్ హమాలీల కూలి రేట్లు వెంటనే పెంచాలని ప్రభుత్వానికి ఎపి పౌరసరఫరాల సంస్థ హమాలీల రాష్ట్ర యూనియన్ (సిఐటియు) విజ్ఞప్తి చేసింది. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి ఎరియర్స్‌తో సహా చెల్లించాలని, హమాలీల బిల్లుల చెల్లింపు విషయంలో కేంద్ర ప్రభుత్వం విధించిన షరతులు ఉపసంహరించి వ్యక్తిగత ఖాతాలకు బిల్లులు జమ చేయాలని కోరింది. విజయవాడ దుర్గాపురంలోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణ అధ్యక్షతన బుధవారం జరిగిన రాష్ట్ర కమిటీ విస్తృత సమావేశం ఈ మేరకు తీర్మానించింది.

20వ తేదీలోపు అన్ని జిల్లాల్లో రాయబారం

హమాలీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20వ తేదీలోపు జిల్లా కలెక్టరు, కార్మికశాఖ అధికారులు, మంత్రులు ఇతర ప్రజా ప్రతినిధులకు రాయబారాలు నిర్వహించాలని, వచ్చే నెల 6వ తేదీన 'చలో ఎమ్‌డి ఆఫీస్' కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించిందని తెలిపారు. సమావేశం అనంతరం విజయవాడ ఆటోనగర్‌లో గల పౌరసరఫరాలశాఖ ఎమ్‌డి కార్యాలయంలో ప్రజా పంపిణీ వ్యవస్థ జనరల్ మేనేజర్ (జిఎం) లక్ష్మీనరసింహకు రాష్ట్ర నాయకత్వం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ.. హమాలీల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ ఉదరుభాస్కర్‌రావు, రాష్ట్ర నాయకులు రాజు రమేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# 13న కలెక్టరేట్ వద్ద ధర్నా జయప్రదం చేయాలి



కురుపాం: పెన్ పవర్ ప్రతినిధి మార్చి 11: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలని కోరుతూ ఈనెల 13న మన్యం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు పిలుపునిచ్చారు. జియ్యమ్మవలస మండలం గడసింగపురంలో ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు సంబంధించిన ప్రచారం బుధవారం నిర్వహించి గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని బలహీనపరిచేలా కొత్త చట్టాలను తీసుకువస్తోందని విమర్శించారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే ఈ పథకం దేశంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. ఈ పథకాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని, ఉపాధి కూలీలు తమ హక్కుల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఈనెల 13న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ఉపాధి కూలీలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు భూతాల మోహనరావు, గరుగుబిల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.పాచిపెంట : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, పాత పద్ధతిలో కొనసాగించాలని, కేంద్రం చేసిన కొత్త చట్టాన్ని రద్దు చేయాలని మండలంలోని పాంచాలి, గురునాయుడుపేట, మోసూరు, గరెల్లవలస, పాచిపెంట, కొత్తవలస, గడివలస, తోటవలస విశ్వనాధపురం, పణుకు వలసలో సిపిఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు ఉపాధి కూలీలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు వెనుకబడి ఉన్న జిల్లాల్లో మన్యం జిల్లా కూడా ఉంది, వలసలు ఎక్కువ, కంపెనీలు తక్కువగా ఉన్న ప్రాంతంగా మన్యం జిల్లా ఉందన్నారు. దీంతో ఉపాధి హామీ చట్టమే ప్రధాన ఉపాధిగా ఈ ప్రాంత ప్రజలకు ఉందన్నారు. అటువంటి చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. ఈ విషయమై వేతనదారులకు అవగాహన కల్పించేందుకు సిపిఎం ఈనెల 11, 12 తేదీల్లో గ్రామాల్లో ప్రచారం, 13న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్టు తెలిపారు. కావున ఈ ధర్నాకు కూలీలంతా కదిలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.శ్రీను, కె.ఈశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సుర్రు రామారావు, జర్నీ రామయ్య, మంచాల శీను, ఆటో యూనియన్ నాయకులు పోలరాజు, రమేష్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ పివి టీకాపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి

## గర్భాశయ క్యాన్సర్ నివారణను ఈ వ్యాక్సిన్ నివారిస్తుంది

## 14 సంవత్సరాల నిండిన బాలికలకు హెచ్ పి వి టీకా వేయించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ





గోకవరం పెన్ పవర్ ప్రతినిధి మార్చి 11: మహిళలకు గర్భాశయ క్యాన్సర్ రాకుండా ఉండాలంటే ముందుగా హెచ్ పి వి వ్యాక్సిన్ వేయించుకోవాలని ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ అన్నారు. ఇందులో భాగంగా గోకవరం ప్రభుత్వ ఆసుపత్రి నందు ఆసుపత్రి ప్రధాన వైద్యురాలు డాక్టర్ రామలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన హెచ్ పి వి వ్యాక్సిన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని 14 సంవత్సరాలు నిండిన బాలికలకు వ్యాక్సిన్ వేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ఎంతో విలువైనదని, ఇదే వ్యాక్సిన్ ప్రైవేట్ ఆసుపత్రిలో సుమారు పదివేలకు పైగా ఖర్చు అవుతుందని ఈ వ్యాక్సిన్ ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. హెచ్ పి వి వ్యాక్సిన్ 80% కంటే పైగా కచ్చితమైన ఫలితాలను ఇస్తున్నట్టు శాస్త్రీయంగా నిరూపితమైందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డాక్టర్ ల తో పాటు జగ్గంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ అడపా భరత్ కుమార్, సూరంపాలెం ప్రాజెక్టు చైర్మన్ ఉంగరాల రాము జగ్గంపేట నియోజవర్గ అభివృద్ధి కమిటీ సభ్యులు కన్నబాబు , మంగరౌతు రామకృష్ణ, సొసైటీ మాజీ చైర్మన్ దాసరి తమ్మన్నదొర, మాజీ జెడ్పిటిసి పాలూరి బోసి బాబు, తంటికొండ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి అచ్చెన్నదొర, తిరుమలాయ పాలెం సర్పంచ్ పురంశెట్టి శివాజీ, మండల ప్రధాన కార్యదర్శి గునిపే భరత్, దాసరి సీతారామకృష్ణ, బద్దిరెడ్డి బాబి,మండిగ గంగాధర్, గళ్ళ రాము,ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రాయవరపు శ్రీనివాసరావు, అల్లాడ అరుణ, పిట్ట అరుణ్ కుమార్ , ఎస్ బాబు, కోన శివ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను బడిబాట, బంగారుబాట బలోపేతం చేయండి....





సఖినేటిపల్లి పెన్ పవర్ ప్రతినిధి మార్చి 11: అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలంలో రాష్ట్ర, జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశాలు మేరకు మండల విద్యాశాఖ అధికారులు డి కిషోర్ కుమార్, యం వేంకటేశ్వర రావు అధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ సమావేశం మందిరంలో అన్నీ పాఠశాలల ఉపాధ్యాయులకు విద్యార్థుల సంఖ్య పెరుగుదల పై మండల సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ వీరా మల్లిబాబు పాల్గొనినారు. ఎంపీపీ మల్లిబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రతి ఇంటింటికీ తిరుగుతూ తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించలని, భవితకు బంగారు బాట వేసుకోంమని, తల్లిదండ్రులకు తెలియజేయాలని కోరారు. ప్రభుత్వ బడిలో చదువుకునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, సాక్స్, తల్లికి వందనం, ఎస్ ఆర్ కె విద్యార్థి మిత్ర పథకం ద్వారా ఉచితంగా అందిస్తున్నారని, శ్రీమతి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా పౌష్టికాహారాన్ని ఉచితంగా అందిస్తున్నారని, దూర ప్రాంతం నుండి వచ్చే విద్యార్థులకు రవాణా చార్జీలు ప్రభుత్వం చెల్లిస్తోంది. ఆహ్లాద కరమైన వాతావరణంలో ఆధునిక హంగులతో స్మార్ట్ క్లాస్ రూమ్ లు విద్యార్థులకు ఆసక్తి కలిగేలా బోధించే సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నారని, కావున ప్రభుత్వ బడిలో లభించే నాణ్యమైన ఉచిత విద్యను పాఠశాల పరిసరాలలో నివసించే ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని, తమ పిల్లలను పాఠశాలలో చేర్పించ వలసినదిగా తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలలలో జాయిన్ చేసేటట్లు చేయాలని మండల విద్యాశాఖ అధికారులు డి.కిషోర్ కుమార్, యం. వెంకటేశ్వర రావు మాట్లాడారు. ఎంపీపీ వీరా మల్లిబాబు చేతులు మీదుగా వివిధ పోటీల విజేతలకు జ్ఞాపికలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అడ్మిషన్ల వేట



కాకినాడ : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 11: కాకినాడ జిల్లాలో ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో అడ్మిషన్ల దందా అప్పుడే ప్రారంభమైపోయింది. 2026–27 విద్యా సంవత్సరానికి గాను ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు అడ్మిషన్ల కోసం వేట మొదలెట్టాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికే కొన్ని పట్టణ ప్రాంతాల్లో పలువురు టీచర్లు కరపత్రాలను చేత పట్టుకుని ఇంటిటికీ తిరుగుతూ అడ్మిషన్లను అభ్యర్థించే పనిలో నిమగమయ్యారు. ఈ నెల 16 నుంచి ఒంటి పూట సెలవులు ప్రారంభం కానున్నాయి. ఆ తర్వాత నుంచి దాదాపు అన్ని విద్యాసంస్థలు పూర్తిస్థాయిలో అడ్మిషన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెట్టి తమ విద్యాసంస్థలలోనే పిల్లలను చేర్చాలనే ప్రయత్నాలలో సాగుతున్నాయి. జిల్లాలో సుమారు 570 ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలున్నాయి. వీటిల్లో దాదాపు 1.30 లక్షల మంది విద్యార్థులు ఏటా చదువుతున్నారు. అలాగే 110 ప్రయివేటు ఇంటర్ కాలేజీల్లో సుమారు 40 వేల మంది, డిగ్రీ కాలేజీలు సుమారు 25 ఉండగా సుమారు 20 వేల మంది చదువుతున్నారు. ఈ నేపథ్యంలో తమ వ్యాపార స్వలాభాల కోసం పలు విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి విద్యా వ్యాపారానికి అప్పుడే తెరలేపాయి. ఈ విద్యా సంవత్సరం ముగియడానికి ఇంకా నెలా 15 రోజులు, వచ్చే విద్యా సంవత్సరం మొదలు కావడానికి ఇంకా మూడు నెలలకు పైగా గడువున్నా పిల్లల తల్లిదండ్రులకు వల వేయడం కోసం టీచర్లను పావులుగా వాడుకుంటున్నాయి. ఇప్పటికే కాకినాడ నగరంతో పాటు పెద్దాపురం, పిఠాపురం వంటి పట్టణాల్లో కొన్ని రోజులుగా కొన్ని విద్యాసంస్థలు అడ్మిషన్ల వేట కొనసాగిస్తున్నాయి. ప్రస్తుతం సెలవు దినాల్లో ఈ వేట సాగిస్తున్నారు.ప్రలోభాలకు తెరఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు, వాటికి చెందిన టీచర్లు, అధ్యాపకులు ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థుల వివరాలను సేకరిస్తున్నారు. ప్రధానంగా 10 తరగతి లోపు పిల్లలపైనే కార్పొరేట్ విద్యాసంస్థలు దృష్టి సారించాయి. తమ పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆకర్షణీయమైన బొమ్మలు ముద్రించిన మల్టీ కలర్ కరపత్రాలు, బ్రోచట్లతో గేలం వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. తమ విద్యా సంస్థల్లో సకల సౌకర్యాలు ఉన్నాయని, ఫీజు రాయితీ ఇస్తామంటూ ప్రలోభాలకు గురిచేస్తున్నారు. ఆయా విద్యాసంస్థల నుంచి 10 వ తరగతి విద్యార్థుల జాబితాలను సేకరించి ఇంటర్ కళాశాలలు, ఇంటర్ జాబితాలను సేకరించి డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు అడ్మిషన్ల కోసం కరపత్రాలతో ఇళ్లను చుడుతున్నారు. ప్రయిమరీ నుంచే స్మార్ట్ క్లాసులు, టెక్నో, డిజిటల్ తరగతులు, కంప్యూటర్ అధునాతన సౌకర్యాలు ఎన్నో ఉన్నాయంటూ తల్లిదండ్రులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు.ఇవీ నిబంధనలుచట్టం ప్రకారం ప్రయివేటు పాఠశాలలు మొదటి తరగతిలో 25 శాతం సీట్లు పేద, వెనుకబడిన వర్గాల పిల్లలకు కేటాయించాలి. డొనేషన్లు, కేపిటేషన్ ఫీజులు వసూలు చేయకూడదు. నోటిఫై చేసిన ఫీజు మాత్రమే వసూలు చేసుకోవాలి. ఇంటర్వ్యూలు చేయకూడదు. విద్యార్థులు లేదా తల్లిదండ్రులతో ఇఒంటర్వ్యూ, స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించకూడదు. స్కూల్‌లో ఎన్ని సీట్లు ఖాళీగా ఉన్నాయి, అడ్మిషన్ షెడ్యూల్, ఫీజు వివరాలు, బోధన మాధ్యమం ఇవి నోటీస్ బోర్డు లేదా వెబ్‌సైట్‌లో ప్రదర్శించాలి. ఇంటర్ కాలేజీలు 10వ తరగతి పాస్ అయిన విద్యార్థులకు మాత్రమే అడ్మిషన్లు నిర్వహించాలి. ఎస్ఎస్‌సి,, సిబిఎస్‌ఇ లేదా సమానమైన పరీక్ష పాస్ అయి ఉండాలి. కాలేజీకి అనుమతి తప్పనిసరి. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే ఎక్కువ వసూలు చేయ కూడదు. ఫీజు వివరాలు కాలేజీలో ప్రదర్శించాలి. విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, అడ్మిషన్ తీసుకున్న వెంటనే బిఐఇఎపి పోర్టల్‌లో విద్యార్థి డేటా నమోదు చేయాలి. మౌలిక సదుపాయాలు ఉండాలి. సరైన క్లాస్‌రూమ్స్, ల్యాబ్స్, అర్హత గల లెక్చరర్లు, లైబ్రరీ ఉండాలి. హాస్టల్ వేరే అనుమతి పొందాలి.అసౌకర్యాల నడుమపలు పాఠశాలలు ప్రతిభ పరీక్ష ఆధారంగా ఆయా స్కూళ్లలో చేర్పించుకుంటున్నాయి. వసతులు లేకపోయినా అన్ని సౌకర్యాలు ఉన్నాయంటూ అసత్య ప్రచారాలు చేసుకుంటున్నాయి. క్రీడా స్థలాలు లేకపోయినా సరిపడా మరుగుదొడ్లు కానరాకున్నా, బాలురు, బాలికలకు విడివిడిగా బాత్ రూమ్‌లు లేకపోయినా యథేచ్ఛగా నిర్వహించ బడుతున్నాయి. ఆయా పాఠశాలాల్లో టీచింగ్ స్టాఫ్ విద్యార్హత వివరాలు తప్పనిసరిగా కనబడేలా ఉంచాలి. ఎలిమెంటరీ పాఠశాలల్లో డిఎడ్, హైస్కూల్స్‌లో బిఇడి అర్హత కలిగిన ఉపాధ్యాయులు మాత్రమే ఉండాలనే పలు నిబంధనలను తుంగలోకి తొక్కుతున్నాయి.

# విడిపోయిన చేతిని అతికించిన ఎయిమ్స్ వైద్యులు - 8 గంటల పాటు శ్రమించిన వైద్య బృందం - రాష్ట్రంలోనే మొట్టమొదటి అరుదైన సర్జరీ.







మంగళగిరి, పెన్ పవర్ ప్రతినిధి మార్చి 11: ప్రమాదవశాత్తు విడిపోయిన చేతికి ఎయిమ్స్ వైద్యులు క్లిష్టమైన మైక్రో సర్జరీ విజయవంతంగా నిర్వహించి తిరిగి అతికించారు. ఎనిమిది గంటలపాటు ఎయిమ్స్ వైద్య బృందం శ్రమించి తెగిన నరాలు, రక్తనాళాలను జోడించి చేతిని పూర్వస్థితికి తీసుకువచ్చారు. జార్ఖండ్ కు చెందిన ఓ 25 ఏళ్ల యువకుడు రోడ్డు నిర్మాణ సంస్థలు మెషిన్ లోడ్ ఆపరేటర్ గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో గత నెల 22వ తేదీ విజయవాడలోని హనుమాన్ జంక్షన్ సమీపంలో టార్మెషన్లో అతని ఎడమ చేయి మధ్య భుజం వద్ద పూర్తిగా విడిపోయింది. అదే రోజు తోటి కార్మికులు, కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రి అత్యవసర విభాగానికి తీసుకొచ్చారు. అతని విడిపోయిన చేయి కూడా వెంట తీసుకొచ్చారు. వెంటనే వైద్య బృందం పరీక్షించి చేయి నిలబడే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని కుటుంబ సభ్యులకు తెలిపారు. అయినప్పటికీ సవాళ్లను ఎదుర్కొంటూ అత్యవసరంగా చేతిని మళ్లీ అమర్చే శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించారు. డాక్టర్ శాంత కుమార్ శివలింగప్ప ఆధ్వర్యంలో ప్లాస్టిక్ సర్జరీ బృందం క్షతగాత్రుడికి శస్త్ర చికిత్సను నిర్వహించింది. అత్యంత నిపుణతతో కూడిన మైక్రో సర్జరీ పద్ధతుల ద్వారా వైద్యులు ప్రధాన రక్తనాళాలను పునర్నిర్మించి ఎముకను స్థిరపరచడంతోపాటు కండరాలు, మృదు కణజాలాలను మరమ్మతు చేసి విడిపోయిన చేతిని విజయవంతంగా మళ్లీ అమర్చారు. ఈ క్రిష్టమైన శస్త్ర చికిత్స సుమారు 8 గంటల పాటు కొనసాగింది. ఇటువంటి అత్యాధునిక మైక్రో సర్జరీ శస్త్ర చికిత్సలు చాలా అరుదుగా జరుగుతాయని, కొన్ని ప్రత్యేక వైద్య కేంద్రాల్లో మాత్రమే అందుబాటులో ఉంటాయని వైద్యులు తెలిపారు. అటువంటిది ఎయిమ్స్ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. శాసన శిక్ష అనంతరం రోగిని 14 రోజులపాటు క్రిటికల్ కేర్ యూనిట్ లో పర్యవేక్షించినట్లు తెలిపారు. శస్త్ర చికిత్స చేసినచేతి కదలికలు, మూత్రపిండాల పనితీరు తో అటు శరీరంలోని ఇతర అవయువాల పనితీరును పరిశీలించినట్లు తెలిపారు. శస్త్ర చికిత్స జరిగిన ఐదు రోజుల తర్వాత చేతి పై ఉన్న గాయాన్ని స్కిన్ గ్రాఫ్ట్ (చర్మ మార్పిడి) విజయవంతంగా మూసివేసినట్లు తెలిపారు. నరాలు తీవ్రంగా దెబ్బతిన్న కారణంగా మొదటి శస్త్ర చికిత్స సమయంలో నరాల మరమ్మతు చేయడం సాధ్యపడలేదని, రెండవ దశ శస్త్ర చికిత్సలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా నరాల పునర్నిర్మాణం,

ఎముకలను శాశ్వతంగా స్థిరపరచడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం రోగి వార్డులో కోరుకుంటున్నాడని, మరి కొంతకాలం పర్యవేక్షణ అనంతరం త్వరలోనే డిశ్చార్జి చేయనున్నట్లు వైద్య బృందం తెలిపారు. కిష్టమైన శస్త్ర చికిత్సలో పాల్గొన్న వైద్య బృందాన్ని ఎయిమ్స్ ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ ప్రొఫెసర్ డాక్టర్ అహంతేమ్ శాంతా సింగ్ అభినందించారు. ఎయిమ్స్ లో ఉన్న ఆధునిక ట్రామా కేర్, మైక్రో సర్జరీ సామర్థ్యాలను చూపించడంతోపాటు రాష్ట్రంలో క్లిష్టమైన శస్త్ర చికిత్స రంగంలో ఎయిమ్స్ ఆసుపత్రి మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు.

# పాఠశాలల అభివృద్ధికి అమరా బచ్చు ఛారిటబుల్ ట్రస్ట్ చేయూత - మంత్రి లోకేష్ ను కలిసిన ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ బచ్చు కృష్ణ కుమార్ దంపతులు.



మంగళగిరి, పెన్ పవర్ ప్రతినిధి మార్చి 11: పేదల సాధికారతకు కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన పీ-4 కార్యక్రమానికి నెల్లూరు జిల్లా బోగోలుకు చెందిన అమరా ఛారిటబుల్ ట్రస్ట్ చేయూత అందించనుంది. ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ను కలిసిన ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ బచ్చు కృష్ణ కుమార్ దంపతులు బోగోలు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో విద్య మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.5 కోట్ల సాయం ప్రకటించారు. త్వరలో చేపట్టనున్న ఆయా అభివృద్ధి పనుల శంకుస్థాపనకు రావాలని మంత్రిని ఆహ్వానించారు. పీ-4 కార్యక్రమంలో భాగంగా మన బడి-మన భవిష్యత్ కింద బోగోలు మండలంలోని పలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులను మెరుగుపర్చనున్నారు. మన బడి- మన భవిష్యత్తు కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రవాస భారతీయులు, పూర్వవిద్యార్థులను భాగస్వామ్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తోంది. దాతల పేర్లు కూడా ఆయా పాఠశాలలకు పెట్టుకునే అవకాశం కల్పించనుంది. త్వరలోనే మన బడి - మన భవిష్యత్తు వెబ్ సైట్ ను ప్రారంభించనుంది. మరోవైపు బోగోలు మండలం కొవ్వూరుపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి రూ.5 కోట్లు, కొండ బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి రూ.5 కోట్ల సాయాన్ని అమరా బచ్చు ఛారిటబుల్ ట్రస్ట్ అందించనుంది.

# దశాబ్దాల సమస్యకు పరిష్కారం!




రాయదుర్గం:పెన్ పవర్ ప్రతినిధి మార్చి 11:రాయదుర్గం పట్టణంలో దశాబ్దాల కాలంగా పరిష్కారం కాని కీలకమైన సమస్యలను తీర్చే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. రాయదుర్గం పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద కొత్తగా నిర్మించిన రోడ్డును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జనసమర్థం అధికంగా ఉండే కాయగూరల మార్కెట్ చుట్టూ రూ.32లక్షలు ఖర్చుపెట్టి మంచి రోడ్డు నిర్మించామన్నారు. స్థానికంగా కొందరు నిర్మాణాలు చేసుకున్నప్పటికీ ప్రజల సౌకర్యార్థం ఆక్రమణల తొలగింపునకు పెద్ద మనసుతో సహకరించడం పట్ల వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాని రహదారి పక్కనే ఉన్న మార్కెట్ కు వచ్చి వెళ్లడానికి ప్రజలు ఇదివరలో అనేక ఇబ్బందులు పడేవారన్నారు. ఆరు అడుగుల మేర రోడ్డును విస్తరిస్తూ కొత్త రోడ్డు వేయడంతో నేడు చాలా ఉపయోగకరంగా ఉందన్నారు. స్థానికంగా వాహనాలు నిలుపుకోవడానికి అనువైన పార్కింగ్ స్థలం, అవసరమైన ఇతరత్రా ఏర్పాట్లు చేయించాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి ని ఆదేశించారు. పట్టణంలో గడచిన 20 నెలల్లో ప్రజల మౌలిక అవసరాల కోసం ప్రభుత్వం రూ. తొమ్మిది కోట్ల వ్యయంతో అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. ముఖ్యంగా సిసి రోడ్లు, కాలనీలో అంతర్గత రహదారులు, మురికి కాలువలు, తాగునీటి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత కల్పించామన్నారు.

# అమరావతి మండలం భూ సేకరణలో భూమి కోల్పోతున్న రైతన్న కు న్యాయం చేయాలి




అమరావతి ;పెన్ పవర్ ప్రతినిధి మార్చి 11: అమరావతి మండలంలో 8 గ్రామాల్లో జరుగుతున్నటువంటి భూ సమీకరణ, సేకరణ లో భూమి కోల్పోతున్నా రైతాంగానికి న్యాయమైన నష్ట పరిహారం ఇవ్వాలి, భూమి మీద ఆధారపడిన కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, ఇతర చేతివృత్తుల ప్రజానీకాన్ని ఆదుకోవాలి – ఉపాధి హామీ పనులను పెద్ద ఎత్తున చూపించడానికి అధికారులు సన్నద్ధం కావాలి – సిపిఎం. రాజధాని అవసరాలు, ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం చేస్తున్న భూ సమీకరణ, సేకరణలో భూములు కోల్పోతున్న రైతాంగాన్ని కి న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలి . భూమ్మీద కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, ఇతర చేతివృత్తుల ప్రజానీకాన్ని ఆదుకోవాలని సిపిఎం పలనాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి రవిబాబు అన్నారు. సిపిఎం రూరల్ మండల శాఖ సమావేశం కామ్రేడ్ తల్లం బ్రహ్మయ్య స్మారక భవనంలో పి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ మండలంలోని వైకుంటపురం, పెద్దమద్దూరు, చావపాడు, ఎంద్రాయి, లేమల్లె కర్లపూడి గ్రామాల్లో భూమి మొత్తాన్ని రాజధాని అవసరాలు నిమిత్తం రెండో విడత భూ సమీకరణ, ఔటర్ రింగ్ రోడ్డు అవసరాల కోసం ధరణికోట, లింగాపురం గ్రామాల్లో భూమిని భూ సమీకరణ క్రింద సేకరించడం జరుగుతుందని తెలిపారు. సమీకరణ, సేకరణ కింద భూములు కోల్పోతున్న రైతాంగానికి న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి అవసరానికి మించి భూమిని 250 మీటర్లు వెడల్పులో సేకరిస్తున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించిందని వెడల్పున 70 మీటర్లకు తగ్గించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతాంగానికి న్యాయమైన నష్ట పరిహారం ఇవ్వటానికి, అదేవిధంగా భూమి మీద ఆధారపడినటువంటి కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, ఇతర ప్రజానీకాన్ని ఆదుకోవటానికి ఆయా గ్రామాలలో గ్రామసభలను జరిపి ప్రజల యొక్క అభిప్రాయాలను కూడా తెలుసుకోవాలని, ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సమీకరణ చేస్తున్న గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఆయా గ్రామాల అభివృద్ధి అవసరాల కోసం కొనసాగించాలని కోరారు. గ్రామాలలో మౌలిక సౌకర్యాలు మురుగు కాలువలు త్రాగునీరు సమస్యలు ఉన్నాయని ఈ సమస్యల పరిష్కారానికి కూడా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు బి సూరిబాబు, రూరల్ శాఖ కార్యదర్శి సయ్యద్ మోహిద్దీన్, నందూరి వెంకటేశ్వరరాజు, షేక్ నాగుల్ మీర తదితరులు పాల్గొన్నారు.

# పరిశీలకుల అంచనా ప్రకారం ఇది ముమ్మాడికీ మట్టి మాఫియా హత్యే.





మంగళగిరి, పెన్ పవర్ ప్రతినిధి మార్చి 11: కనీసం సమయపాలన లేకుండా, అడ్డగోలుగా తిరుగుతున్న లారీల కింద ఓ వృద్ధురాలు ప్రాణం. మట్టి మాఫియా దనదాహానికి బలైంది. గత కొద్ది నెలలుగా ప్రజలు గగ్గోలు పెడుతున్నా. పరిశీలకుల మద్దతుతో విచ్చలవిడిగా చెలరేగిపోతున్న నల్లమట్టి మాఫియా. పరిశీలనగా గమనిస్తే ఈ ప్రమాదంలో రోడ్డు పక్కన ఉన్న కరెంట్ స్తంభంను లారీ ఢీకొట్టి ఆగింది లేకుంటే పక్కనే ఉన్న ఇంట్లోకి నేరుగా దూసుకుపోయి పెనుప్రమాదం సంభవించేది. ఇంక నల్లమట్టి మాఫియా కి అడ్డేముంది అని జరుగుతున్న సంఘటనలు పరిశీలిస్తున్న వారు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇదేం మాయో తెలీదు కానీ ఇలాంటి ఘటనలు పట్ల ఆరోపించడం కానీ, ఫిర్యాదులు చేసే బాధ్యత ను కనీసం ప్రతిపక్ష పార్టీ నాయకులు తీసుకోకపోవడం గమనించాల్సిన పరిశీలించాల్సిన విషయం. ఈ నల్లమట్టి మాఫియాకి అడ్డుకట్ట వేసేదేవరు? వారి లారీల జోరుకు బ్రేకులు పడేదెప్పుడు? ప్రమాద భయాల గుప్పిట్లో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్న ప్రజల మొర ఆలకించేదెవరో ఆ పరిశీలకులు కే తెలియాలి.

# ప్రభుత్వం ప్రకటించిన 99 మద్యం ఎక్కడ? అనంతసాగరంలో మందుబాబుల అసంతృప్తి



నెల్లూరు పెన్ పవర్ ప్రతినిధి మార్చి 11:అనంతసాగరం మండలంలోని ప్రభుత్వ అనుమతితో నడుస్తున్న నాలుగు వైన్ షాపుల్లో 99రూపాయల ధరలో అందించాల్సిన మద్యం బ్రాండ్లు అందుబాటులో లేకపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. తక్కువ ధరలో మద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 99రూ బ్రాండ్లు షాపుల్లో కనిపించకపోవడంతో మందుబాబులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు మద్యం కొనడానికి వచ్చే పలువురు కస్టమర్లు ?99 బ్రాండ్ల కోసం అడుగుతున్నప్పటికీ, అవి స్టాక్‌లో లేవని షాప్ యజమానులు చెబుతున్నారు. దీంతో కొన్నిసార్లు కస్టమర్లు, షాప్ యజమానుల మధ్య వాగ్వాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన ధరకు మద్యం ఇవ్వడం లేదని కొందరు ఆరోపిస్తుండగా, తమకు ఆ బ్రాండ్ల సరఫరా జరగలేదని యజమానులు స్పష్టం చేస్తున్నారు. ఈ అంశంపై స్థానికులు కూడా స్పందిస్తూ, ప్రభుత్వం ప్రకటించిన పథకం అమలులో లోపాలున్నాయా అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. నిజంగా ప్రభుత్వం 99 బ్రాండ్లను సరఫరా చేస్తుందా లేక మధ్యలోనే సరఫరా నిలిచిపోయిందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ?99 మద్యం బ్రాండ్ల సరఫరాపై స్పష్టత ఇవ్వాలని, షాపుల్లో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని మందుబాబులు మరియు స్థానికులు కోరుతున్నారు.

# అమరావతి మండలం గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం






అమరావతి పెన్ పవర్ ప్రతినిధి మార్చి 11: ఈరోజు గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అమరావతి లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళా దినోత్సవ వారోత్సవాలను గుడ్ షెఫర్డ్ ఆవరణలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత గుడ్ షెఫర్డ్ సంస్థ డైరెక్టర్ సిస్టర్ అంటో వహించి మాట్లాడుతూ కనులు తెరిచిన క్షణం నుండి బంధం కోసం బాధ్యత కోసం అందరికీ ఆత్మీయత పంచి తన వారి కోసం అహర్నిశలు కృషించి వారి భవిష్యత్తు కోసం ఇంటిని నందనవనం చేసే ప్రతి స్త్రీ మూర్తికి అభివందనం చేస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు అని అన్నారు. ముఖ్యఅతిథిగా పల్లోటి ఫాదర్స్ రీజనల్ డైరెక్టర్ ఫాదర్ బాలాజీ బోయెల్ల గారు విచ్చేసి మాట్లాడుతూ ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు ఉంటారని స్త్రీలను గౌరవించడం మన సాంప్రదాయం అన్నారు. ఈ గుడ్ షెఫర్డ్ సంస్థని స్థాపించింది ఒక మహిళ . ఈ సంస్థ 74 దేశాల్లో పని చేస్తుందన్నారు . గుడ్ షెఫర్డ్ సిస్టర్స్ని మొదట ఆడవాళ్ళ హక్కుల సంఘం సిస్టర్స్ అనేవాళ్ళు మహిళల హక్కుల కోసం పనిచేస్తున్న సిస్టర్స్కి ధన్యవాదాలు అన్నారు. డిప్యూటీ ఎంపీడీవో పద్మశ్రీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందు ఉన్నారు అందుకే అందరికీ అవకాశం ఇవ్వాలి ఆడపిల్లల్ని బాగా చదివించాలి అన్నారు. అమరావతి మండల తహసిల్దార్ డానియల్ మాట్లాడుతూ మహిళలు తక్కువ ఎం కాదు పురుషులతో సమానంగా ఉన్నారన్నారు. అందుకే ప్రతి ఆడపిల్లల్ని చదివించడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. హై కోర్ట్ అడ్వకేట్ కృష్ణాంజనేయులు మాట్లాడుతూ మహిళలు సహకార సంఘాల ద్వారా అభివృద్ధి చెందాలన్నారు. మహిళలు వాళ్ళకున్న సమస్యలు ఎదుర్కొనే విధంగా తయారవ్వాలి అన్నారు. ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ మహిళలు లేకపోతే సృష్టి లేదు సృష్టికి మూలం మహిళ అన్నారు. ఉదయం లేచిన కానుంచి మొదలు రాత్రి పడుకునే దాకా మహిళలు అన్ని రంగాల్లో 100% పని చేస్తున్నారన్నారు. ఫాదర్ వినోద్ మాట్లాడుతూ ఒక కుటుంబం సంతోషంగా ఉందంటే అందుకు ఆ కుటుంబంలో స్త్రీలే కారణం ఉన్నారు. పల్లోటి విచారణ గురువులు బెజ్జం కిషోర్ ఫాదర్ మాట్లాడుతూ స్త్రీ లేకపోతే ఇల్లంతా గందరగోళంగా ఉంటుందన్నారు ఏ చిన్న దెబ్బ తగిలిన అమ్మ అని అంటాము అంటే స్త్రీ గొప్పతనం అంతా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ శిక్షణ పూర్తి అయిన బాలికలకు సర్టిఫికెట్స్ ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాడికొండ ఎంపీటీసీ నూతక్కి పరిమళ, సిస్టర్ పావని, సిస్టర్ డియానా, సంస్థ సిబ్బంది , రాజేశ్వరి విమల మరియమ్మ బ్యుల, లక్ష్మణ్ అమరావతి క్రోసూరు పెదకూరపాడు మండలాల నుంచి మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# 12వ తేదీన సోషల్ ఆడిట్



బెల్లంకొండ పెన్ పవర్ ప్రతినిధి మార్చి 11:బెల్లంకొండ మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్ బహిరంగ ప్రజావేదిక సమావేశం ఈనెల 12న మండల పరిషత్ కార్యాలయం నందు ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి సునీత తెలిపారు 20 24 ఏప్రిల్ 1 నుండి 20 25 మార్చి 31 వరకు గ్రామాల్లో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం సోషల్ ఆడిట్ నిర్వహించామని తెలిపారు.అధికారులు ,ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు ,నాయకులు, ప్రజా వేదికకు హాజరై అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు

# కేడర్ లో అసంతృప్తి..

**కాకినాడ, మార్చి 11, పెన్ పవర్:** జనసేన పార్టీఆవిర్భావ దినోత్సవం అంటే ఆ పార్టీ కేడర్‌కు ఒక పండగ. అణచివేతను ఎదిరించి, ప్రశ్నించే గొంతుకగా పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో, ఈసారి పిఠాపురం వేదికగా జరిగే వేడుకలు రాజకీయంగా పెను సంచలనం సృష్టిస్తాయని అందరూ భావించారు. కానీ, అనూహ్యంగా పార్టీ అధిష్టానం ఈ వేడుకలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం జనసైనికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.రాష్ట్ర రాజకీయాల్లో జనసేన గ్రాఫ్ పెరుగుతున్న తరుణంలో, ఈ నెల 14న పిఠాపురంలో జరగాల్సిన పార్టీ ఆవిర్భావ సభ రద్దు కావడం చర్చనీయాంశంగా మారింది. స్వయంగా అధినేత పవన్ కల్యాణ్ గతంలో ఇచ్చిన హామీ ప్రకారం.. ఈ సభ పార్టీ బలోపేతానికి ఒక దిక్సూచిలా మారుతుందని కేడర్ ఎంతో ఆశగా ఎదురుచూసింది. కానీ, ప్రస్తుత నిర్ణయం కార్యకర్తల ఉత్సాహంపై నీళ్లు చల్లిందనే చెప్పాలి.పార్టీ అధికారికంగా చెబుతున్న ప్రధాన కారణం సభ్యత్వ నమోదు. ఇప్పటివరకు దాదాపు 8.70 లక్షల మంది సభ్యత్వం తీసుకున్నారు. సభ్యత్వ నమోదు గడువు రేపటితో ముగియాల్సి ఉన్నా, లక్ష్యాన్ని చేరుకోవడానికి ఈ గడువును పొడిగించే ఆలోచనలో అధిష్టానం ఉంది. క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని నిరూపించుకోవాలంటే గణాంకాలు ముఖ్యం కాబట్టి, సభ ఏర్పాట్ల కంటే సభ్యత్వాలపైనే పూర్తి దృష్టి పెట్టాలని పవన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.అయితే సభ రద్దు వెనుక ఇతర బలమైన కారణాలున్నాయని సమాచారం. సభ్యత్వ నమోదుతో పాటు మరికొన్ని అంశాలు కూడా ఇందుకు దోహదం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. వేలాదిగా తరలివచ్చే కేడర్‌కు ఎండ దెబ్బ తగలకుండా చూడటం అధినేత బాధ్యతగా భావిస్తున్నారు. రాష్ట్రంలో జరిగిన కల్తీ పాలు, బాణాసంచా పేలుడు ఘటనలు పార్టీ వర్గాల్లో కొంత ఆవేదనను నింపాయి. ఇలాంటి సమయంలో భారీ వేడుకలు నిర్వహించడం సబబు కాదని పార్టీ భావించి ఉండవచ్చు. పిఠాపురం పవన్ కల్యాణ్ సొంత నియోజకవర్గం కావడంతో, అక్కడ ఎలాంటి అపశ్రుతులు జరగకూడదని, అత్యంత పకడ్బందీగా మరోసారి పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించవచ్చని పార్టీ వర్గాలు అంటున్నాయి.జనసేన పార్టీకి భావోద్వేగాలే బలం. పవన్ కల్యాణ్ పిలుపు కోసం ఎదురుచూసే లక్షలాది మంది యువత, పిఠాపురం వేదికగా ఆయన ఇచ్చే పొలిటికల్ స్పీచ్ కోసం సిద్ధమయ్యారు. పార్టీని బలోపేతం చేసే క్రమంలో ఇలాంటి భారీ బహిరంగ సభలు కార్యకర్తల్లో కొత్త జోష్ నింపుతాయి. ఇప్పుడు సభ రద్దు కావడంతో, క్షేత్రస్థాయిలో కేడర్ డీలా పడిపోయింది. పార్టీ బలోపేతం ముఖ్యమే కానీ కార్యకర్తల ఆత్మీయ కలయిక కూడా అంతే ముఖ్యమనేది సగటు జనసైనికుడి ఆవేదన.నిర్ణయం కఠినంగా ఉన్నా, పార్టీ దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా పవన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. సభ రద్దుతో వచ్చిన అసంతృప్తిని పోగొట్టాలంటే, సభ్యత్వ నమోదులో రికార్డు సృష్టించడమే కాకుండా, త్వరలోనే మరో భారీ మేనిఫెస్టో సభ లేదా ప్లీనరీ లాంటి కార్యక్రమాన్ని ప్రకటించాల్సిన అవసరం ఉంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పార్టీ తోడు లేకుంటే మీరంతా ఎక్కడ.. చంద్రబాబు క్లాస్!

**విజయవాడ, మార్చి 11, పెన్ పవర్:** టీడీపీ అధినేత చంద్రబాబు. వివాదాస్పదంగా మారిన ఎమ్మెల్యేలకు తనదైన శైలిలో చెక్ చెప్పారు. అందరూ బుద్దిగా ప్రవర్తించాలని లేకుంటే వేటు తప్పదని స్మూత్ గా హెచ్చరించారు. ప్రజలు కూటమి సర్కార్ పై నమ్మకముంచి గెలిపించారని.. లేదంటే మీరంతా ఎక్కడుండేవారు గుర్తుచేసుకోవాలన్నారు. ప్రధాని నరేంద్రమోడీ, తాను, పవన్ కల్యాణ్.. కలిసికట్టుగా సాగుతుంటే.. మీరు మాత్రం లేనిపోని వివాదాలతో కాలం గడుపుతున్నారని హెచ్చరించారు.చంద్రబాబు అసెంబ్లీ వేదికగానే ఎమ్మెల్యేలకు ఏకమొత్తంగా క్లాస్ ఇచ్చేశారు. ఎవరికివారు తామే బలవంతులం అనుకుంటున్నారని, అలా అయితే 2019లో ఎందుకు పరాజయం పాలయ్యారో ఆలోచించుకోవాలని చురకలు అంటించారు. తాను, పవన్ కళ్యాణ్, మోడీ ముగ్గురు కలిస్తేనే ప్రజలు విశ్వసించి ఓట్లేశారని, ఈ కూటమి సజావుగా సాగేందుకు నాయకులు కూడా కలిసి ఉండాలని తేల్చి చెప్పారు. అంతేకాదు, ఎవరైనా తమకు సొంత బలం ఉంటుందని అనుకుంటే తనకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు.కూటమిలో ఉన్న పవన్, మోడీ, తాను ప్రజలకు మరింత చేరువ అవుతున్నామని, క్షేత్రస్థాయిలో నాయకులు కీచులాడుకోవడం వస్తే అది వారికే నష్టమని వ్యాఖ్యానించారు. కలివిడిగా ఉంటేనే రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేయాలని అన్నారు. అలాకాదని అనుకుంటే అప్పుడు తెలుస్తుందని పరోక్షంగా హెచ్చరించారు. కూటమిగా ఉండాల్సిన అవసరం అందరికీ ఉంటుందని వ్యాఖ్యానించారు.నేతలు తమంత వారు లేరని భావిస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వివాదాలు కూడా అదేవిధంగా కొనసాగుతున్నాయి. గతం నుంచి వివాదాలకు దిగుతున్న నేతలు కొందరు అయితే, కొత్తగా మరికొందరు వివాదాలకు కేంద్రంగా మారుతున్నారు. దీంతో పైస్థాయిలో కూటమి నాయకుల మధ్య ఐక్యత ఉన్నప్పటికీ, గ్రౌండ్ లెవెల్లో మాత్రం ఒకింత ఇబ్బందికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.

## వివేకా హత్య కేసుపై సుప్రీంకోర్టులో విచారణ.. 4 వారాల్లోనే తీర్పు!

**విజయవాడ, మార్చి 11, పెన్ పవర్:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం వెలువరించింది. కేసు దర్యాప్తు ముగిసినట్లు సీబీఐ స్పష్టం చేయడంతో విచారణ వేగవంతం చేయాలని దిగువ కోర్టుకు సూచించింది. నాలుగు వారాల్లో అన్ని పిటిషన్లపై విచారణ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. వివేకా కేసులో దర్యాప్తును మధ్యలోనే నిలిపివేశారని, హత్యతో మరికొందరికి సంబంధం ఉందని వివేకా కుమార్తె వైఎస్ సునీత గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుప్రీంకోర్టు సూచన మేరకు నాంపల్లి సీబీఐ కోర్టు కేసు దర్యాప్తును తిరిగి ప్రారంభించాలని సీబీఐని ఆదేశించింది. దీనిపై సీబీఐ దర్యాప్తు జరిపినా కొత్తగా నిందితులుగా ఎవరినీ గుర్తించలేదని సుప్రీంకోర్టుకు నివేదించింది.సీబీఐ పిటిషన్ పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు వివేకా కేసులో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ట్రయల్ కోర్టును ఆశ్రయించాలని సూచిస్తూ వివేకా కుమార్తె వైఎస్ సునీత వేసిన పిటిషన్లను పరిష్కరించింది. నిందితుల బెయిల్ పిటిషన్ల రద్దు చేయాలన్న సునీత వినతిని సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. అంతేకాకుండా తాము లేవనెత్తిన అభ్యంతరాలపై దర్యాప్తు జరపలేదని సునీత అభ్యంతరంపై ట్రయల్ కోర్టునే ఆశ్రయించాలని సూచించింది. వివేకా హత్య కేసుకు సంబంధించి సెక్షన్ 207 కింద దాఖలైన అన్ని పిటిషన్లను నాలుగు వారాల్లో పరిష్కరించాలని ట్రయల్ కోర్టును సుప్రీం ధర్మాసనం ఆదేశించింది.కాగా, సీబీఐ నిర్ణయంతో ఈ విషయంలో వివేకా కుమార్తె సునీతకు ఎదురుదెబ్బ తగిలినట్లుగా భావిస్తున్నారు. కేసులో ఇప్పటికే గుర్తించిన నిందితులతోపాటు మరికొందరికి సంబంధం ఉందని సునీత అనుమానిస్తున్నారు. తన అనుమానాలను నివృత్తి చేయాలని కోరుతూ కోర్టుల్లో న్యాయపోరాటం చేస్తున్నారు. దీంతో హత్య కేసు ట్రైల్ కూడా ఆలస్యమవుతోందని అంటున్నారు. దర్యాప్తు పూర్తయిందని, నిందితులు అందరినీ అరెస్టు చేశామని సీబీఐ చెబుతూ వస్తోంది. అదే సమయంలో సునీత అభ్యంతరాలను అనుమానాలను పరిష్కరించేందుకు ట్రయల్ కోర్టు సూచనల మేరకు నిందితుడు సునీల్ యాదవ్ సోదరుడు కిరణ్ యాదవ్, మాజీ సీఎం జగన్ బంధువు అర్జున్ రెడ్డిని విచారించింది.ఈ విచారణలో కొత్త విషయాలు ఏవీ వెలుగు చూడలేదని సీబీఐ తాజాగా సుప్రీంకోర్టుకు నివేదించింది. దీంతో సునీత అనుమానాలు అపోహలుగానే మిగిలిపోయాయని అంటున్నారు. హత్యకు సంబంధించి ట్రయల్ కోర్టులో మూడో చార్జిషీటును కూడా సీబీఐ సమర్పించడంతో దర్యాప్తు పూర్తయిందని సుప్రీంకోర్టు నిర్ణయించిందని అంటున్నారు. ఇకపై ఎలాంటి దర్యాప్తు అవసరం లేదని భావించడమే కాకుండా, విచారణ వేగవంతం చేయాలని ఆదేశించింది. వివేకా హత్య జరిగి ఇప్పటికే ఆరేళు దాటిపోయింది. ఇప్పటికే నిందితుల అరెస్టు జరగడం, చార్జిషీటులు దాఖలు కావడంతో బెయిలు రద్దు పిటిషన్లను కోర్టు కొట్టివేసింది. ఈ పరిస్థితుల్లో నాలుగు వారాల గడువులోగా 207 కింద దాఖలైన అన్ని పిటిషన్లను పరిష్కరించే పరిస్థితి కనిపిస్తుండటంతో త్వరలో వివేకా కేసుపై విచారణ ముగుస్తుందని అంచనా వేస్తున్నారు.

## ఏపీలో 'ఇంద్రధనస్సు'.. విశేషాలు ఇవే!

**విజయవాడ, మార్చి 11, పెన్ పవర్:** ఏపీలో ఇంద్ర ధనస్సు.. అంటే ప్రకృతి పరంగా ఆకాశంలో ఏర్పడే ఇంద్ర ధనస్సుకాదు.. ప్రభుత్వ పరంగా పేదలను ఆదుకునేందుకు తీసుకువచ్చిన కీలక పథకం. దీని కి సీఎం చంద్రబాబు వినూత్నంగా ఉండాలన్న ఉద్దేశంతో 'ఇంద్రధనస్సు'గా పేరు పెట్టారు. ఈ కార్యక్రమం కింద.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దివ్యాంగులకు.. ఎంపిక చేసిన ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తారు.తాజాగా జరుగుతున్న 6వ కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు స్వయంగా ఈ పథకాన్ని ప్రకటించారు. గత కొన్నాళ్లుగా దివ్యాంగుల నుంచి వస్తున్న అభ్యర్థన మేరకు.. ఈ ప్రతిపాదనపై నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. వాస్తవానికి ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులో ఉంది. దివ్యాంగు లైన మహిళలు ఈ సేవలు పొందుతున్నారు. అయితే..పురుషల సమస్య ప్రభుత్వానికి విన్నవించారు. ఈ క్రమంలో దివ్యాంగులైన వారు ఎవరైనా.. ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు అవకాశం కల్పించారు.ఈ క్రమంలోనే వినూత్నంగా ఉండే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి.. ఇంద్రధనస్సు అని పేరు నిర్ధారించినట్టు.. సీఎం చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్రంలో ఎంపిక చేసిన బస్సుల్లో దివ్యాంగులు. ఉచితంగా ఎక్కడ నుంచి ఎక్కడికైనా.. తమ ఆధార్ కార్డును చూపించి ప్రయాణించవచ్చని.. తెలిపారు. దీనికి సదరం సర్టిఫికెట్ కూడా ఇస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం 1.5 కోట్ల మంది మహిళలు స్త్రీశక్తి పేరిట అమలు చేస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సులను వినియోగించుకుంటున్నారని తెలిపారు.వీరితోపాటు.. విద్యార్థులు, ఇప్పుడు దివ్యాంగులకు కూడా ఉచిత ఆర్టీసీ సేవలను అందుబాటులోకి తీసుకు వస్తున్నామన్నారు. దివ్యాంగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలోనూ.. వారిని విదేశాలకు పంపించి .. చదివించడంలోనూ టీడీపీ కూటమి ప్రభుత్వం ముందుందని తెలిపారు. వృత్తులను కూడా ప్రోత్సహిస్తు న్నామని చెప్పారు. ట్రైసైకిళ్లతోపాటు.. ట్రైస్కూటీలను కూడా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. దివ్యాంగులకు అండగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని వివరించారు.

# ఎన్డీయేకు జై కొట్టిన జగన్

**విజయవాడ, మార్చి 11, పెన్ పవర్:** జాతీయస్థాయిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి చర్చకు వచ్చింది. ఆ పార్టీ ఇప్పుడు సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. జాతీయస్థాయిలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో లోక్సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చారు. ఇండియా కూటమి అంతా ఈ తీర్మానానికి మద్దతు ప్రకటించింది. తృణమూల్ కాంగ్రెస్ సైతం తమ మద్దతు పై ప్రకటన చేసింది. దీనిపై పార్లమెంట్లో చర్చ జరగనుంది. ప్రభుత్వ సమాధానం తర్వాత ఓటింగ్ నిర్వహిస్తారు. అయితే ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అవిశ్వాసానికి మద్దతు ఇస్తుందా? వ్యతిరేకిస్తుందా అనేది హాట్ టాపిక్. ఒక విధంగా ఇది ఆ పార్టీకి సంక్లిష్ట సమస్య. అవిశ్వాసానికి మద్దతు ఇస్తే బిజెపి ఆగ్రహానికి గురికాక తప్పదు. ఒకవేళ వ్యతిరేకిస్తే మాత్రం జాతీయస్థాయిలో ఆ పార్టీకి స్నేహితులు అనేవారు కరువు అవుతారు.వైసీపీ నిర్ణయంపై హాట్ డిస్కషన్.. ఆంధ్రప్రదేశ్ కు సంబంధించి 21 మంది కూటమి ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరంతా ఎన్డీఏ కు మద్దతుగా ఉంటారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నలుగురు ఎంపీలు ఉన్నారు. కచ్చితంగా వీరు ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితి. పోనీ తెలంగాణలో కెసిఆర్ పార్టీకి ఎంపీలు ఉన్నారా అంటే లేరు. దీంతో ఆ పార్టీకి వచ్చిన ఇబ్బందులు ఏమీ లేవు. 17 మంది ఎంపీలకు గాను చెరి సగం ఎంపీలు కాంగ్రెస్ పార్టీతో పాటు బిజెపి పంచుకున్నాయి. ఎంఐఎం కు ఒక్క ఎంపీ ఉన్నారు. అయితే ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయం ఏంటి అనేది హాట్ టాపిక్.గతంలో ఉపరాష్ట్రపతి త పాటు స్పీకర్ ఎన్నికల



సమయంలో ఎన్డీఏ అభ్యర్థికి మద్దతు ఇచ్చింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. తాజాగా జగన్మోహన్ రెడ్డి తన పాత కేసుల విషయంలో బెంగళూరు వేదికగా కీలక చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వచ్చాయి. మద్యం కుంభకోణం, వివేకానంద రెడ్డి హత్య కేసు, జగన్ పై ఉన్న పాట కేసులు తెరపైకి వస్తున్న నేపథ్యంలో.. జగన్మోహన్ రెడ్డి కచ్చితంగా ఎన్డీఏకు మద్దతుగా నిలుస్తారన్న వారే అధికం. పార్టీ ఎంపీలతో ఇప్పటికే సమావేశం నిర్వహించారు జగన్మోహన్ రెడ్డి. సూత్రప్రాయంగా ఎన్డీఏకు మద్దతు ఇచ్చేందుకు ఒక నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఒకవైపు బిజెపి భాగస్వామిగా ఉన్న కూటమికి వ్యతిరేకంగా ఉంటూనే.. తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామిగా ఉన్న ఎన్డీఏకు జగన్మోహన్ రెడ్డి మద్దతు తెలపడం మాత్రం జాతీయస్థాయిలో హాట్ టాపిక్ అవుతోంది. ఇది ఆ పార్టీకి ఇబ్బందికరమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు

# లిక్కర్ స్కాంలో ఆస్తుల అటాచ్






**విజయవాడ, మార్చి 11, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ లో ఈడీ దూకుడు పెంచింది. మాజీ సీఎం జగన్ తరపున పనులు చక్కబెట్టారన్న ఆరోపణలున్న వారిని ఈడీ పిలిచి ప్రశ్నిస్తోంది. ఇప్పటికే వెయ్యి కోట్ల మనీలాండరింగ్ ను గుర్తించినట్లుగా చెప్పి నాలుగు వందల కోట్లకు పైగా ఆస్తులను అటాచ్ చేసింది. సిట్ దర్యాప్తుపై వైసీపీ తీవ్ర విమర్శలుచేసింది. అసలు మద్యం స్కామే లేదని అంతా సృష్టిస్తున్నారని ఆరోపించింది. కానీ ఈడీ దర్యాప్తుపై మాత్రం నోరు మెదపడం లేదు. ఎందుకు మౌనంగా ఉంటున్నారు? ఆంధ్రప్రదేశ్ మద్యం స్కాంలో జరిగిన సుమారు రూ. 4,000 కోట్ల కుంభకోణం కేసులో ఈడీ తన పట్టును బిగిస్తోంది. ఏకంగా రూ. 441.63 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేయడం రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపింది. ఇందులో ప్రధాన నిందితుడు రాజ్ కేసిరెడ్డి, బూనేటి చాణక్య, వాసుదేవరెడ్డి వంటి వారి స్థిరాస్తులు, బ్యాంక్ నిల్వలు ఉన్నాయి. ఇప్పటివరకు దాదాపు రూ. 1,048 కోట్ల మేర ముడుపులు చేతులు మారినట్లు ఈడీ నిర్ధారించింది. మద్యం తయారీదారుల నుంచి బలవంతంగా నగదు, బంగారం వసూలు చేశారని, ఆ సొమ్మును షెల్ కంపెనీల ద్వారా మళ్లించారని దర్యాప్తు సంస్థ గట్టి ఆధారాలు సేకరించింది.గతంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ దర్యాప్తు చేపట్టినప్పుడు వైఎస్సార్సీపీ నేతలు తీవ్రంగా స్పందించాయి. అదంతా రాజకీయ కక్ష సాధింపు అని, టీడీపీ ప్రభుత్వం కావాలనే అబద్ధపు కేసులు సృష్టిస్తోందని ఆరోపించాయి. కానీ, ఇప్పుడు ఈడీ రంగంలోకి దిగి ఆస్తులను జప్తు చేస్తున్నా, నోటీసులు జారీ చేస్తున్నా వైఎస్సార్సీపీ అగ్రనాయకత్వం నుంచి ఆ స్థాయిలో ఖండనలు రావడం లేదు. సిట్‌ను విమర్శించినట్లుగా ఈడీని విమర్శించలేకపోవడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహం , భయం దాగి ఉన్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. కేంద్ర దర్యాప్తు సంస్థ అయిన ఈడీని నేరుగా టార్గెట్ చేస్తే అది ఢిల్లీ స్థాయిలో రివర్స్ అవుతుందనే ఆందోళన వైఎస్సార్సీపీలో కనిపిస్తోందని చెబుతున్నారు. అందుకే సిట్‌ను రాష్ట్ర ప్రభుత్వ విభాగంగా ముద్ర వేసి తిట్టగలిగిన వారు, ఈడీ దగ్గరకు వచ్చేసరికి మౌనంగా ఉండిపోతున్నారు. ఈడీ తన దర్యాప్తులో మనీ లాండరింగ్ ఆధారాలతో చర్యలు తీసుకోవడం వైఎస్సార్సీపీకి గట్టి ఎదురుదెబ్బ. కేవలం రాజకీయ ఆరోపణలైతే ప్రజల్లో సానుభూతి పొందవచ్చు, కానీ వందల కోట్ల ఆస్తులను జప్తు చేయడం, నగదు లావాదేవీలను సాక్ష్యాలతో సహా చూపడం వంటివి ప్రజల్లో పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తాయి. ఈ స్కామ్‌లో ఇప్పటికే జగన్ కు అత్యంత సన్నిహితులుగా

వ్యవహరించిన వారిని పిలిచి ప్రశ్నించారు ఈడీ అధికారులు. ఐదేళ్ల పాటు వైసీపీ హయాంలో పూర్తి స్థాయిలో చక్రం తిప్పిన మాజీ ఐఏఎస్ ధనుంజయ్ రెడ్డి, జగన్ వ్యక్తిగత పీఏ కృష్ణమోహన్ రెడ్డి వంటి వారిని పిలిపించి.. గత పదేళ్ల బ్యాంక్ స్టేట్‌మెంట్లు, పాన్ కార్డులు, కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న ఆస్తుల డాక్యుమెంట్లను తీసుకున్నారు. అలాగే జగన్‌కు మరో అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందిన విజయవాడ జిల్లా జైలులో ఉన్న ఏ1 నిందితుడు రాజ్ కేసిరెడ్డిని కోర్టు అనుమతితో విచారించి కీలక వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఆయన ఇచ్చిన సమాచారం ఆధారంగానే ప్రస్తుతం ఇతర అధికారులకు, రాజకీయ అనుచరులకు నోటీసులు వెళు న్నాయి. ఈ అంశంపై విమర్శలు గుప్పించడం కన్నా ..సైలెంట్ గా ఉండటమే మంచిదని వైసీపీ భావిస్తున్నట్లుగా కనిపిస్తోంది.

## కావాలనే గిల్‌ని తప్పించి సూర్యకు కెప్టెన్సీ..
# గంభీర్- అగార్కర్ నిర్ణయం భేష్




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్లేయర్స్ మంచి ప్రదర్శన చేస్తే మ్యాచ్ లోనైనా టోర్నమెంట్ లోనైనా ఉంటారు. మరి వారిని నడిపించే సారథిగా కూడా అదే స్థాయిలో ఉండాలి. ఆ ఆటగాళ్లను ఎంపిక చేసే సెలక్టరుకి కాస్త పరిజ్ఞానం ఉండాలి. ఈ మూడు అంశాలు కుదిరితే 'కప్ గెలవడం' విజయవంతం అవుతుంది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్,– చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ ద్వయానికి కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ జత కలవడంతో టీ20 ప్రపంచ కప్ ని భారత జట్టు కైవసం చేసుకుంది. ఈ మెగా టోర్నీకి ముందు అగార్కర్--- గంభీర్ తీసుకున్న కఠిన నిర్ణయాలతోనే ఇది సాధ్యమైందని చెప్పాలి.

రోహిత్ శర్మ టీ20లకి వీడ్కోలు చెప్పడంతో హార్దిక్ కి సారథ్య బాధ్యతలు ఇస్తారని అందరూ భావించారు. కానీ సూర్యకుమార్ ని గంభీర్-- అగార్కర్ కెప్టెన్ గా ఎంపిక చేశారు. ప్రపంచ కప్ ముందు జరిగిన ద్వైపాక్షిక సిరీస్ లలో శుభ్ మన్ గిల్ ని సూర్యకు డిప్యూటీగా మేనేజ్మెంట్ ఎంపిక చేసింది. భవిష్యత్తులో గిల్ కే సారథ్యం అప్పగిస్తారనే ప్రచారం జోరుగా సాగింది. గిల్ వరుసగా విఫలం కావడంతో.. సూర్య కివీస్ తో జరిగిన సిరీస్ లో మాత్రమే కాస్త ఫర్వాలేదనిపించడంతో.. అతడిపై నమ్మకం ఉంచిన అగార్కర్---గంభీర్ కెప్టెన్ గా కొనసాగించారు. దీంతో సూర్య దూకుడుగా ఆడగలడని భావించిన బీసీసీఐ సెలక్షన్ కమిటీ.. గిల్ పై వేటు వేసింది. తమకు ఆడే విధానమే ముఖ్యం.. ఫామ్ తాత్కాలికమని ఇతర సభ్యులకూ హెచ్చరిక పంపినట్లు అయింది. దాదాపు 2 ఏళ్లు జాతీయ జట్టుకు దూరమైన ఇషాన్ దేశవాళీలో అదరగొట్టడంతో.. జాతీయ జట్టులో అతడికి మళ్లీ ఛాన్స్ కల్పించడం.. ఈ ప్రపంచకప్ లోనూ దూకుడుగా ఆడిన విషయం అందరికి తెలిసిందే. అందుకే, ఈ కప్ గెలిచిన అనంతరం రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మన్, అజిత అగార్కర్ కి ఈ ట్రోఫీని అంకితం చేస్తున్నట్లు గౌతమ్ గంభీర్ వెల్లడించాడు. చీఫ్ సెలక్టర్ గా అజిత్ అగార్కర్ పదవీ కాలం ఈ ఏడాది జూన్ తో ముగుస్తుంది. ఇప్పటికే అతడి పదవీకాలాన్ని బీసీసీఐ పొడిగించింది. కానీ 2027లో వన్డే ప్రపంచ కప్, వరల్డ్ టెస్టు ఛాంపియన్షిప్ ఫైనల్, 2028లో ఒలింపిక్స్ పాటు అదే ఏడాది టీ20 ప్రపంచ కప్ ఉండటంతో.. అజిత్ పదవి కాలాన్ని మరికొంతకాలం పొడిగిస్తారనే ప్రచారం జరుగుతుంది. అలాగే గంభీర్ పదవీకాలం కూడా వచ్చే ఏడాది వన్డే వరల్డ్ కప్ వరకు మాత్రమే ఉంది. వీరిద్దరిని మరికొంతకాలం ఉపయోగించుకుంటే మరిన్ని టైటిళ్లను టీమిండియా కైవసం చేసుకుంటుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సూర్య కుమార్ తన లక్ష్యాలేంటో క్లియర్ గా చెప్పేశాడు. ప్లేయర్ గా, కోచ్ గా ఇప్పటికే టీ20 ప్రపంచ కప్ ను గెలిచిన గంభీర్.. వన్డే ప్రపంచ కప్ నూ సాధిస్తే మరో అరుదైన రికార్డును తన ఖాతాలో పడటం ఖాయం. మరే ఇతర ప్రధాన కోచ్ కూడా ఇలాంటి చరిత్రను నమోదు చేయలేదు. ధోనీ నాయకత్వంలో గెలిచిన 2011 వన్డే వరల్డ్ కప్ జట్టులోనూ గంభీర్ సభ్యుడే ఉన్నాడు.

# టీమిండియా నెక్స్ట్ టీ20 కెప్టెన్‌గా సంజు శాంసన్..





**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత భారత జట్టు సంబరాల్లో మునిగిపోయింది. ఇప్పటి వరకు మూడు సార్లు టీ20 ప్రపంచ కప్ కైవసం చేసుకున్న తొలి జట్టుగా ఇండియ నిలవగా.. సొంతగడ్డపై ట్రోఫీ నెగ్గిన మొదటి జట్టుగా రికార్డు నెలకొల్పింది. 2024 ప్రపంచకప్ ట్రోఫీ కైవసం చేసుకున్న తర్వాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లాంటి స్టార్లు రిటైర్‌మెంట్ ఇవ్వగా,, యువ జట్టు ఎలా ఆడుతుందోనని అనుమానాలు వ్యక్తం అయ్యాయి. కానీ అవన్నీ ఫటాపంచల్ చేస్తూ 2026 విశ్వవిజేతగా అవతరించింది. రోహిత్ శర్మ నుంచి టీ20 పగ్గాలు తీసుకున్న సూర్యకుమార్ యాదవ్ ఇప్పటి వరకు ఒక్క సిరీస్ కూడా ఓడిపోని సారథిగా నిలిచాడు. ఆసియా కప్, టీ20 ప్రపంచకప్ గెలిపించిన కెప్టెన్‌గా కొనసాగుతున్నాడు. కాగా భారత జట్టు భవిష్యత్ కెప్టెన్ గురించి ఇప్పటి నుంచి సోషల్ మీడియాలో తెగ చర్చలు స్టార్ట్ అయ్యాయి. ప్రస్తుతం సూర్యకి 35 ఏళ్లు కాగా.. 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్, వచ్చే వరల్డ్ కప్ (2028) నాటికి అతడికి 37 ఏళ్లు వస్తాయి. కాబట్టి, టీమ్‌లో ఉన్నప్పటికీ.. కెప్టెన్‌గా మాత్రం కొనసాగుతాడా లేదా అనేది డౌటే.

ప్రస్తుతం ఉన్న జట్టులో కెప్టెన్సీ రేసులో చాలామంది ఆటగాళ్ల పేర్లు వినిపిస్తున్నాయి. మొదటి వరుసలో మాత్రం సంజూ శాంసన్ పేరు ఉంది. వరల్డ్ కప్ లో చివరి మూడు మ్యాచ్ లలో చేసిన?అద్భుత ప్రదర్శన చేసి భారత్ విశ్వవిజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ టీమ్‌కు కెప్టెన్‌గా పని చేసిన అనుభవం అతడికి ఉంది. జట్టులోని సీనియర్ ప్లేయర్ కావడంతో సూర్యకు సరైన వారసుడిగా సంజూనే అని పలువురు మాజీలు విశ్లేషిస్తున్నారు. కొత్త కెప్టెన్సీపై టీమిండియా మాజీ క్రికెటర్ మొహమ్మద్ కైఫ్ మాట్లాడుతూ.. టీ20 జట్టు సారథిగా సంజూ శాంసన్ మంచి ఎంపిక అన్నారు. సంజూకు కెప్టెన్ ఉండాల్సిన అన్ని లక్షణాలు ఉన్నాయి.. క్లిష్ట సమయాల్లో కూడా ఎలాంటి టెన్షన్ లేకుండా నిర్ణయాలు తీసుకునే సత్తా అతడికి ఉందన్నారు. సూర్యకుమార్ తరువాత కొత్త కెప్టెన్ ఎవరు అని ఇప్పుడే చెప్పడం చాలా కష్టం.. సంజూ మాత్రం ముందు వరుసలో ఉంటాడని పేర్కొన్నాడు. కెప్టెన్ ప్రపంచాన్ని చూసిన వ్యక్తి అయి ఉండాలని.. బౌలింగ్‌లో మార్పులు.. సరైన ఆటగాళ్లను తుది జట్టులో ఆడించడం.. ఫామ్‌లో లేని వాళ్లకు సపోర్టు చేయడం ఆటలో భాగమని కెప్టెన్‌గా తెలిసిన వ్యక్తి ఉండాలన్నాడు. శాంసన్ కచ్చితంగా కెప్టెన్సీ రేసులో ఉంటాడని నేను భావిస్తున్నాను అని కైఫ్ పేర్కొన్నారు. సూర్యకుమార్ రిటైర్‌మెంట్ ప్రకటిస్తే.. ఆ స్థానాన్ని భర్తీ చేయగలడు వ్యక్తి సంజునే.. ఐపీఎల్‌లో చాలా మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. రాజస్థాన్ రాయల్స్‌ను 2022 ఫైనల్‌కు తీసుకెళ్లాడు. అతడి వయస్సు కేవలం 31 ఏళ్లు మాత్రమే.. కాబట్టి, టీమిండియా తదుపరి కెప్టెన్ కావొచ్చని చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం జట్టులో ఉన్న వారిలో హార్దిక్ పాండ్యాకు కెప్టెన్సీ బాధ్యతలు ఇచ్చి.. తీసేశారు. వైస్ కెప్టెన్‌గా ఉన్న అక్షర్ పటేల్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించే ఛాన్స్ లు చాలా తక్కువగా ఉన్నాయి. మిగిలిన వారందరితో పోల్చితే, సంజూనే ది బెస్ట్ ఆప్షన్‌గా కనిపిస్తున్నాడని ఇతర మాజీ ఆటగాళ్లు వెల్లడిస్తున్నారు.

# చెన్నైలోకి సంజు శాంసన్ ఎంట్రీ.. ధోనీ ఆడటంపై అనుమానాలు.. సీఈవో ఏమన్నారంటే!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) 2026 19వ సీజన్ మార్చి 28వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ క్యాష్ రిచ్ లీగ్ కోసం ఇప్పటికే అన్ని ఫ్రాంచైజీలు తమ ప్రాక్టీస్ క్యాంపులను ప్రారంభించాయి. దీంతో గత సీజన్ లో పేలవ ప్రదర్శనతో టోర్నీని ముగించిన చెన్నై సూపర్ కింగ్స్ ఈసారి జట్టులో భారీ మార్పులు చేసింది. దీంతో టీమ్ లోకి కొత్తగా సంజు శాంసన్ తో పాటు యువ ఆటగాళ్లకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది. అయితే జట్టులోకి సంజు ఎంట్రీ ఇవ్వడంతో.. వయసు కారణంగా ఎంఎస్ ధోనీ అన్ని మ్యాచ్‌లలో ఆడగలరా అన్న సందేహాలు అభిమానుల్లో నెలకొన్నాయి.. ఆయన బెంచ్ కే పరిమితం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగుతుంది. మహేంద్ర సింగ్ ధోనీ ఆడటంపై చెన్నై సూపర్ కింగ్స్ సీఈఓ కాశీ విశ్వనాథన్ మాట్లాడుతూ.. ఐపీఎల్ 2026 సీజన్‌లో దాదాపు అన్ని మ్యాచ్‌లలో ధోనీ ఆడే అవకాశం ఉందని తెలిపారు. ఆయన జట్టులో ఏ పొజిషన్ లో ఆడతారన్నది టీమ్ మేనేజ్‌మెంట్ తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉందన్నారు. జట్టు కోచింగ్ సిబ్బంది నిర్ణయం మేరకు ఆయన బ్యాట్స్‌మన్‌గా ఆడతారా, వికెట్ కీపర్– బ్యాటర్‌గా ఆడతారా లేదా ఇంపాక్ట్ ప్లేయర్‌గా వస్తారా అన్నది త్వరలోనే నిర్ణయిస్తామని వెల్లడించారు.

**చెన్నైలోనే సీఎస్కే హోమ్ మ్యాచ్‌లు:** ఈ ఏడాది జరగనున్న ఐపీఎల్ షెడ్యూల్ త్వరలో ప్రకటించే అవకాశం ఉందని సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్ తెలిపారు. దేశంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో షెడ్యూల్ ప్రకటన కొంత ఆలస్యమైంది. మా హోమ్ మ్యాచ్‌లు అన్నీ తమిళనాడులోనే జరుగుతాయి.. షెడ్యూల్‌ను దీజజ× ప్రకటించేందుకు మేము వేచి చూస్తున్నామని చెప్పారు. ఇక టీమిండియా వరుసగా రెండోసారి టీ20 వరల్డ్ కప్ గెలవడం పట్ల కూడా ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యంగా సీఎస్కే ఆటగాళ్లు సంజు శాంసన్, శివమ్ దూబే టోర్నీలో అద్భుతమైన ప్రదర్శన చేశారని పేర్కొన్నారు. చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ప్రాక్టీస్ క్యాంప్ సజావుగా సాగుతుంది. ఇప్పటి వరకు ఎలాంటి సమస్యలు లేవని కాశీ విశ్వనాథన్ వెల్లడించారు.

# స్టన్నింగ్ డార్క్ లుక్‌లో శ్రుతి హాసన్ గ్లామర్ షో



స్టైలిష్ కో-ఆర్డ్ ఫోటోషూట్‌లో కావ్య థాపర్ గ్లామర్‌ను ప్రసరిస్తుంది



జిన్నీ వెడ్స్ సన్నీ 2ని ప్రమోట్ చేస్తున్నప్పుడు మేధా శంకర్ గ్రీన్ లెహంగాలో స్టన్స్ చేసింది

టాలీవుడ్ బ్యూటీ శ్రుతి హాసన్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచింది. ఒకపక్క తన మధురమైన గొంతుతో మ్యూజిక్ లవర్స్‌ను మైమరపిస్తూనే, మరోపక్క అదిరిపోయే ఫోటోషూట్లతో కుర్రకారు గుండెల్లో సెగలు రేపుతోంది. రీసెంట్‌గా ఆమె షేర్ చేసిన బ్లాక్ అవుట్‌ఫిట్ ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. ఆ డార్క్ అండ్ బోల్డ్ లుక్‌లో శ్రుతి స్టైల్ చూస్తే ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే. అసలు శ్రుతి కొత్త ప్రాజెక్ట్స్ గురించి, ఆ ఫోటోల స్పెషాలిటీ ఏంటో ఇప్పుడు చూద్దాం.

**'పవళమల్లి'తో మాయ చేస్తున్న శ్రుతి.. మ్యూజిక్ మ్యాజిక్:**

శ్రుతి హాసన్‌కు నటనతో పాటు సంగీతం అంటే ఎంత ప్రాణమో మనకు తెలిసిందే. రీసెంట్‌గా ఆమె మహేష్ వారణాసి మూవీలో 'సంచారి' అనే పాటతో మెప్పించగా, ఇప్పుడు 'పవళ మల్లి' అనే మరో బ్యూటిఫుల్ సాంగ్‌తో మన ముందుకు వచ్చింది. యంగ్ కంపోజర్ సాయి అభ్యంకర్ సంగీత దర్శకత్వంలో రూపొందిన ఈ పాటలో శ్రుతి తన గంభీరమైన గొంతుతో ప్రాణం పోసింది. ఈ పాట వింటుంటే తెలియని హాయి కలుగుతోందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. కేవలం నటిగానే కాకుండా, ఒక సింగర్‌గా కూడా తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్‌ను క్రియేట్ చేసుకుంటోంది శ్రుతి.



**బ్లాక్ డ్రెస్.. రెడ్ బ్యాక్‌గ్రౌండ్.. అదిరిపోయిన ఫోటోషూట్:**

పాటలతో పాటు శ్రుతి లేటెస్ట్ ఫోటోషూట్ ఇప్పుడు వైరల్‌గా మారింది. స్టైలిష్ బ్లాక్ క్రాప్ టాప్, లాంగ్ స్కర్ట్‌తో పాటు ఎంబ్రాయిడరీ చేసిన జాకెట్‌ను ధరించి ఆమె ఇచ్చిన పోజులు అదిరిపోయాయి. డార్క్ కలర్ థీమ్‌లో ఉన్న ఈ ఫోటోలకు రెడ్ బ్యాక్‌గ్రౌండ్ తోడవ్వడంతో అవి మరింత అందంగా కనిపిస్తున్నాయి. మినిమల్ యాక్సెసరీస్, సింపుల్ హెయిర్ స్టైల్‌తో శ్రుతి తన బాడీ లాంగ్వేజ్‌తోనే ఒక పవర్‌ఫుల్ వైబ్‌ను క్రియేట్ చేసింది. ముఖ్యంగా ఆమె కళ్లల్లో ఇంటెన్సిటీ ఫోటోలకు హైలైట్‌గా నిలిచింది.

**లైన్ లో క్రేజీ ప్రాజెక్టులు.. సలార్ 2 కోసం వెయిటింగ్:**

శ్రుతి కెరీర్ ప్రస్తుతం మూడు సినిమాలు, ఆరు పాటలు అన్నట్లుగా సాగుతోంది. తెలుగులో 'ఆకాశంలో ఒక తార', తమిళంలో 'ట్రైన్' వంటి వెరైటీ సినిమాల్లో ఆమె నటిస్తోంది. అయితే అందరి కళ్లు మాత్రం ప్రభాస్ సరసన ఆమె నటించబోతున్న 'సలార్ పార్ట్ 2' మీదనే ఉన్నాయి. ఇక ప్రస్తుతం ఈ సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇలా అటు సినిమాలతో, ఇటు ఫ్యాషన్ ఇంకా మ్యూజిక్ తో శ్రుతి హాసన్ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తూ తన క్రేజ్‌ను డబుల్ చేసుకుంటోంది.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D. No. 41-1/5-1, Srinivasa Tower, Flat No. S2, Gowthami Nagar, Krishnalanka, Vijayawada, NTR Dist. editor GANTYADA APPARAO. PRGI Registration No. " APTEL/25/A4561" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965